ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శుక్రవారం 8 నవంబరు 2024



ఏలూరు శనివారపుపేటలో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్న మునిసిపల్ సిబ్బంది

ఎమ్మెల్సీ.. పోరు!

ఎన్నికల బరి నుంచి వైసీపీ ఔట్

- పట్టభద్రుల ఓటర్ల నమోదు వచ్చేనెల 9 వరకు పొడిగింపు
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో గంధం నారాయణరావు.. టీడీపీ నిర్ణయం ఎటు ?
- అమలులోకి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోడ్
- ఎక్కడికక్కడ ఫ్లెక్సీల తొలగింపు

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయడం లేదని వైసీపీ ప్రకటించింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోటీకి అనువుగా ఎస్టీయూ బలపరిచిన అభ్యర్థికి టీడీపీ మద్దతుగా నిలవబోతుంది. ఇప్పటికే టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆ మేరకు జిల్లా వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఫ్లెక్సీలన్నింటిని తొలగిస్తున్నారు. పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల నమోదు ప్రక్రియ ఈనెల 6వ తేదీతో ముగిసినా దీనిని వచ్చేనెల 9 తేదీ వరకు పొడిగించారు. రాబోయే మూడు వారాలు ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడే అన్ని అంశాలపై ప్రభావితం చేయబోతుంది.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం :
మొత్తం ఓటర్లు 2 వేల 605
పురుషులు 1,447
మహిళలు 1,158
పోలింగ్ కేంద్రాలు : 20
నమోదు పొడిగింపు : నేటి సాయంత్రం వరకు

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం :
మొత్తం ఓటర్లు 28 వేల 312 (ఇప్పటివరకు)
ఆన్‌లైన్‌లో 23 వేల 173 మంది
ఆఫ్‌లైన్‌లో 5 వేల 139 మంది
గతంలో ఓటర్ల సంఖ్య 37 వేల 823
నమోదు పొడిగింపు : వచ్చేనెల 9 తేదీ వరకు

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నిక రసవత్తరం

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 11న వెలువడనుండగా అంతకంటే ముందుగానే ఈ ఎన్నిక కాస్తా రసవత్తరంగానే కనిపిస్తోంది. సాధారణంగా జరిగే ఎన్నికల కంటే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు కాస్తంత భిన్నంగానే జరుగుతాయి. విలక్షణ వైరుధ్యం కలిగిన ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆచితూచి వ్యవహరిస్తారు. గత అనుభవాలను బట్టి చూస్తే ఈసారి కూడా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు అత్యంత పకడ్బందీగానే సాగబోతున్నాయి. ప్రత్యేకించి ఇప్పటికే మూడేళ్ల క్రితం ఉమ్మడి జిల్లాలను విభజించి పార్లమెంటరీ నియోజకవర్గాలు ప్రాతి పదికన కొత్త జిల్లాలుగా ఏర్పాటు చేశారు. అయినప్పటికి ఉమ్మడి జిల్లా ప్రాతిపదికనే ఈసారి కూడా ఎన్నిక జరగబోతుంది. ప్రత్యేకించి ఏలూరు కొత్త జిల్లాగా ఏర్పాటైన ఏలూరు, దెందులూరు, పెదపాడు, పెదవేగి, చింతలపూడి, లింగపాలెం, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, పోలవరం, బుట్టాయిగూడెం, టి.నరసా పురం, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం మండలాల పరిధిలో ఓటర్లు మాత్రమే ఈ ఎన్నికల్లో ఓటు వేయ బోతున్నారు. కాని ఏలూరు జిల్లాగా కృష్ణా జిల్లా నుంచి విడగొట్టిన నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి, కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి, మండవల్లి మండలాలు కృష్ణా ఉపాధ్యాయ నియోజకవర్గంలోనే ఉంటాయి. దీనిపై ఎన్నికల కమిషన్ కూడా ఒక స్పష్టత ఇచ్చింది. ఈ లెక్కన ప్రస్తుత ఏలూరు జిల్లా పరిధిలోని మండలాలన్నింటిలోను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 2 వేల 605 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నట్టు గుర్తించారు. వీరిలో పురుషులు 1,447 మంది కాగా, మహిళలు 1,158 మంది. వీరందరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా 20 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ప్రత్యేకించి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఇప్పటికే యూటీఎఫ్ తమ అభ్యర్థిగా గోపిమూర్తిని ప్రకటించింది. దీంతో ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తెర వెనుక వేగంగా కసరత్తు సాగుతోంది. గతంలో ఇదే ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన గంధం నారాయణరావు మరోసారి పోటీకి తలపడాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరిలో ద్రాక్షారామానికి చెందిన గంధం నారాయణరావు గతంలో యూటీఎఫ్ అభ్యర్థి దివంగత నేత షేక్ సాబ్జీతో తలపడ్డారు. అప్పట్లో తొలి రౌండ్‌లోనే నారాయణరావు కంటే సాబ్జీ 6 వేల 450కి పైగా ఓట్లు రావడంతో సాబ్జీనే గెలుపొందారు. ఈ నేపథ్యంలో తాజాగా జరగ బోతున్న ఎన్నికల్లో తిరిగి ఆయన పోటీ చేయాలని యోచిస్తున్నారు. వచ్చే ఆదివారం యూటీఎఫ్ మినహా మిగతా యూనియన్లు తమ పక్షాన ఎవరిని పోటీకి దింపాలి, ఎవరికి మద్దతు ఇవ్వాలనే అంశంపై కీలక నిర్ణయం తీసుకోబోతున్నాయి. ఈ నిర్ణయం తనకు సానుకూలంగా ఉండబోతుందని గంధం నారాయణరావు వర్గం అంచనా వేస్తోంది.

పోటీ నుంచి వైసీపీ పరార్..

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో తమ అభ్యర్థులెవరూ ఉండబోరని వైసీపీ గురువారం అధికారికంగా ప్రకటించింది. అధికారంలో ఉన్న కూటమి నేతలు ఎన్నికలు సజావుగా జరగనివ్వబోరని రాయి విసిరి మరీ తాము పోటీకి దిగడంలేదని ప్రకటించారు. నిన్న మొన్న టివరకు వైసీపీ ఎమ్మెల్సీ ఎన్నికలవైపు ఆఖరు నిమిషంలో తొంగి చూసే అవకాశం లేకపోలేదని కొందరు అంచనా వేశారు. ఇప్పుడున్న రాజకీయ పరిణామాల క్రమంలో ఎదురుగాలి వీస్తుండ డాన్ని గమనించే వైసీపీ పోటీకి దిగడంలేదని ప్రకటించిందని భావిస్తున్నారు. దీనికితోడు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి టీడీపీ తన అభ్యర్థిగా కూటమి పక్షాన రాజశేఖర్‌ను రంగం లోకి దింపింది. ఆయన గెలుపునకు వీలుగా భారీ కసరత్తు చేస్తోంది. ఈ దెబ్బతో వైసీపీ వెనుకడుగు వేసింది. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోను విశ్రాంత లెక్చరర్ గంధం నారాయణరావు పోటీ చేస్తారని, ఆయనకు మద్ద తు ఇవ్వాల్సిందిగా కొందరు టీడీపీపై ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. అయితే టీడీపీ దీనిపై ఇంకా విధాన నిర్ణయం ఏదీ తీసుకోలేదు.


ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ పడబోతున్న గంధం నారాయణరావు

కోడ్ కూసింది

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఇప్పటికే ఎన్నికల నియమావళి (కోడ్) అమలులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా ఎక్కడికక్కడ వీధుల్లో ఉన్న వివిధ రాజకీయ పక్షాల ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. అక్కడక్కడ కూడళ్లల్లో ఉన్న వివిధ పార్టీల నేతల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. ఏలూరు నగరంలో వన్‌టౌన్, టూటౌన్ ప్రాంతంలో ఫ్లెక్సీలు తొలగించారు. నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. అలాగే ఎన్నికల నియమావళి అమలవుతుందో, లేదో తెలుసుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎన్నికలకు వీలుగా రిటర్నింగ్ ఆఫీసర్ల నియామకం పూర్తయ్యింది. ఇదేక్రమంలో ఎన్నికల నియమావళికి అనుగుణంగా ఒక్క అధికారిక సమీక్షలే తప్ప ఈ సమీక్షల్లో ఎటువంటి ప్రకటనలు చేయడం, హామీలు ఇవ్వడం జరగకూడదు. వీటిని విధిగా పాటించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వివిధ అతిథి గృహాల్లో ప్రవేశాలు కూడా నిషేధ జాబితాలో ఉంటాయి.

ఓటర్ల నమోదు పొడిగింపు

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తొలుత ఈనెల 6వ తేదీ వరకే ఓటర్ల నమోదుకు అవకాశం ఇచ్చారు. ఇప్పుడు గడువు ముగిసినా ఇంకా ఓటర్ల జాబితాలో చేరేందుకు ఎక్కువ మంది ఉత్సాహం ప్రదర్శిస్తుండడంతో ఈ గడువును వచ్చేనెల 9 వరకు అధికారికంగా పొడిగించారు. వాస్తవానికి ఇప్పటివరకు అధికారిక సమాచారం ప్రకారం ఒక్క ఏలూరు జిల్లా పరిధిలోనే ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 28 వేల 312గా నమోదైంది. ఇదే 2019లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆనాడు 37 వేల 823 మంది ఉన్నారు. కాని అప్పటికి, ఇప్పటికి వ్యత్యాసం ఎనిమిది వేలకుపైగా ఉండడంతో ప్రధాన పక్షాలు ఈ మధ్యనే ఓటరు నమోదులో కాస్త వేగం పెంచాయి. ప్రత్యేకించి టీడీపీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్‌ను ఇప్పటికే రంగంలోకి దించారు. ఆయన గెలుపు కోసం కూటమి పక్షం యావత్తు కసరత్తు చేస్తోంది. ఓటర్ల నమోదులో గతంకంటే వెనుకబడి ఉండడంతో ఈ మధ్యనే సీఎం చంద్రబాబు ఆగ్రహం వెళ్ళగక్కారు. దీనిదరిమిలా ఇప్పుడు ఓటర్ల నమోదుకు ఆఖరు తేదీ గడువును మరోసారి పెంచడంతో ఈ అవకాశాన్ని వినియోగించుకుని గతంకంటే ఓటర్ల సంఖ్య పెరిగేలా చూడాలనే పట్టుదలతో కూటమి పక్షాలు ఉన్నాయి. ఇప్పటివరకు ఒక్క ఏలూరు జిల్లాలోనే పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఆఫ్‌లైన్ పరిధిలో 5 వేల 139 మంది, ఆన్‌లైన్‌లో 23 వేల 173 మంది ఓటర్లుగా మొత్తం మీద 28 వేల 312 మంది నమోదైనట్టు అయ్యింది. ఇదేక్రమంలో ఉమ్మడి ఉభయ గోదావరిలో ఓటరు నమోదు ప్రక్రియను సవాల్‌గా తీసుకున్న ఎమ్మెల్యేలంతా రాబోయే వారం రోజుల్లోనే కొత్త ఓటర్లను భారీగా నమోదు చేయించబోతున్నారు.


ఏలూరు ఫైర్‌స్టేషన్ సర్కిల్లో, సత్రంపాడులో విగ్రహాలకు ముసుగులు

వచ్చేనెల 9వరకు పట్టభద్రుల ఓటు నమోదుకు అవకాశం

- ఈనెల 23న ముసాయిదా జాబితా
- వచ్చేనెల 30న తుది జాబితా విడుదల

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటు నమోదుకు భారీఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 23న ముసాయిదా జాబితా ప్రకటించనున్నారు. ఈనెల 6వ తేదీ వరకు నమోదు చేసుకున్నవారి పేర్లు ఆరోజున ప్రచురించనున్నారు. ఈనెల 6వ తేదీ వరకు నమోదు చేసుకున్నవారి పేర్లు ఈనెల 23న డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో ప్రచురించనున్నారు. ఈనెల 7నుంచి 23వ తేదీ వరకు ఒక దఫా, ఈనెల 24నుంచి డిసెంబరు 9వరకు మరో దఫా ఓటు నమోదుకు అవకాశం కల్పించారు. వీరందరి పేర్లు వచ్చేనెల 30వ తేదీన తుది జాబితాలో ప్రచురించనున్నారు. ఈ నేపథ్యంలో వచ్చేనెల 9 వరకు ఓటు నమోదుకు అవకాశం ఉంది. ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో పట్టభద్రుల ఓటు నమోదుకు ఇప్పటి వరకు 2,21,556 దరఖాస్తులు వచ్చినట్టు సమాచారం. ఓటు నమో దుకు గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ అవసరం లేదు. సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే ఓటు నమోదు చేస్తారు. దరఖాస్తులను ఏఈఆర్వోలుగా ఉన్న తహసీల్దార్లు ధ్రువీకరిస్తే సరిపోతుంది.

ఉపాధ్యాయులకు నేడు కూడా అవకాశం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి శుక్రవారం సాయంత్రం వరకు ఓటు నమోదు చేసుకోవచ్చని ఓటు నమోదు అధికారి, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట్రావు తెలిపారు. అర్హత ఉన్న ఉపాధ్యాయులు ఉంటే నమోదు చేసుకోవచ్చన్నారు.

రూ.3.51 కోట్లు గ్యాస్ సబ్సిడీ సొమ్ము జమ

ఏలూరుసిటీ, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దీపం-2 ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ఇంతవరకు 42వేల 320 మంది లబ్ధిదారులకు రూ.3.51కోట్లు సబ్సిడీగా అందించామని, మిగిలిన వారికి రెండు రోజుల్లో జమ అవుతుందని జేసీ ధాత్రిరెడ్డి చెప్పారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం సాయంత్రం దీపం-2 పథకం అమలుపై విలేకరుల సమావేశంలో వివరాలను తెలిపారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో ట్రైబుల్ ప్యాకేజీ, దీపం-1, జనరల్, సీఎస్ఆర్, పీఎం ఉజ్వలకు చెందిన వారు ఉచిత ఎల్పీజీ సిలిండర్లు పొందేందుకు అర్హులన్నారు. ఎప్పుడూ లేనంతగా అతి కొద్ది సమయంలోనే 96 వేల మందికి పైగా ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసుకున్నారన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్చి 2025 వరకు ఒక ఉచిత గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ వచ్చిన తర్వాత రెండు రోజులకు సబ్సిడీ లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతోందన్నారు. ఈ-కేవైసీ చేయించుకునేందుకు ఎవరూ గ్యాస్ ఏజన్సీల వద్దకు రానవసరం లేదని, సంబంధిత గ్యాస్ డెలివరీ బాయ్స్ స్వయంగా గ్యాస్ వినియోగదారులు ఇంటివద్దకు వెళ్ళి ఉచితంగానే ఈ-కేవైసీ చేస్తారన్నారు. ఏదైనా సమస్య ఉంటే 1967 టోల్ ఫ్రీ నంబర్ లేదా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేయవచ్చన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

జిల్లాలో రవాణా శాఖ ప్రత్యేక తనిఖీలు

ఏలూరు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి రహదారి నిబంధనలు అతిక్రమించిన వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నట్టు ఏలూరు జిల్లా ఇన్‌చార్జి ఉప రవాణా కమిషనర్ కేఎస్ఎంవీ కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లాలో అక్టోబరు ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు 1614 వాహనాలకు పన్నుల రూపేణా, తదితర కేసులు నమోదు చేసి రూ.92,34,235లు అపరాధ రుసుముగా విధించామన్నారు. విద్యా సంస్థలకు చెందిన 42 బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు. జిల్లాలో 200 హెల్మెట్ కేసులు నమోదు చేసి రూ.రెండు లక్షలు అపరాధ రుసుముగా విధించామన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లను ధరించాలని, లేకుంటే రూ.1000 జరిమానాతో పాటుగా డ్రైవింగ్ లైసెన్సును మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తామన్నారు. పన్ను చెల్లించకుండా తిరుగుతూ పట్టుబడిన రవాణా వాహనాలకు చెల్లించాల్సిన పన్నుతో పాటు గా అదనంగా నూరుశాతం అపరాధ రుసుము విధించి వాహనాలను జప్తు చేస్తామని హెచ్చరించారు.

ఏలూరు జిల్లాలో రెండు పోలీసు శిక్షణా కేంద్రాలు

ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం సుగ్గొండ, తోటపల్లి గ్రామాల్లో ఆక్టోపస్, పోలీసు శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు పోలీసు శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ గ్రామాల్లోని స్థలాలను రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు గురువారం పరిశీలించారు. మెయిన్‌లో



అరకొరగా.. పన్నుల వసూళ్లు!



- నగరంలో సగం కూడా వసూలు కాని ఆస్తిపన్ను
- వసూలు చేయాల్సింది రూ.60.25 కోట్లు
- వసూలైన సొమ్ము : రూ.19.16 కోట్లు



ఏలూరు టూటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధి ఆస్తి పన్ను వసూళ్ల పైనే ఆధారపడి ఉంటుంది. ఆస్తి పన్ను వసూళ్లతో వచ్చే ఆదాయంతో అభివృద్ధి పనులు చేపడతారు. ఆస్తిపన్ను అనుకున్న విధంగా వసూలు కాకపోతే నగరాభివృద్ధి కుంటుపడుతుంది. ఇంత ప్రాధాన్యత కలిగిన పన్ను వసూళ్లలో నగర పాలక సంస్థ రెవెన్యూ సిబ్బంది వెనుక బడ్డారని చెప్పవచ్చు. 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి నగర పాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్నును చెల్లించేవారు 69,570 మంది ఉన్నారు. వీరి ద్వారా ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.60.25 కోట్లు పన్నుల రూపేణ వసూలు చేయాలని పాలక మండలి నిర్ణయించింది. ఆర్థిక సంవత్సరం ప్రారంభమై ఎనిమిది నెలలు కావొస్తోంది. ఇప్పటికి కేవలం రూ.19.16 కోట్లు (31.81 శాతం) మాత్రమే వసూలు చేశారు. రాబోయే నాలుగున్నర నెలల్లో రూ.41.8 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.

పేరుకుపోయిన బకాయిలు

అధిక శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచే బకాయిలు పేరుకుపోయాయి. వీటిలో రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు 167 ఉండగా రూ.7.8 కోట్లు ఆస్తిపన్ను బకాయిలు రావాల్సి ఉంది. వీటిలో కేవలం రూ.52.80 లక్షలు మాత్రమే వసూలు చేశారు. మిగిలిన రూ.7.35 కోట్లు ఎప్పుడు వసూలు చేస్తారో తెలియదు. 53 కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.కోటి 16 లక్షలు వసూలు కావాల్సి ఉండగా రూ.26 లక్షలు వసూలయ్యాయి. నగర పౌరుల నుంచి వసూలు కావాల్సిన ఆస్తిపన్నుల్లో అధికశాతం కొన్నేళ్ల నుంచి పేరుకుపోయిన బకాయిలే ఎక్కువగా ఉన్నాయి. మొత్తం రూ.48.73 కోట్లలో ఈ ఏడాది రూ.32.28 కోట్లు వసూలు కావాల్సి ఉండగా గత కొన్నేళ్లుగా పేరుకుపోయిన బకాయిలు రూ.16.44 కోట్లు ఉన్నాయి. వీటిలో కేవలం రూ.2కోట్లు మాత్రమే వసూలు చేశారు.

అవినీతి ఆరోపణలు

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి సంవత్సరాల నుంచి పేరుకు పోయిన బాకీలు అధికంగానే ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాలపై పన్ను వసూళ్లకు ఎందుకు ఒత్తిడి తేవడం లేదో అధికారులకే తెలియాలి. మరోవైపు సామాన్యుల నుంచి రెవెన్యూ సిబ్బంది పన్నుల వసూళ్లకు వెళ్లి పన్ను వసూలు చేయకుండా వారివద్ద నుంచి ఎంతోకొంత తీసుకుని అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదికాక ఖాళీ స్థలాలు నగరంలో వేలాదిగా ఉండగా కేవలం 774 స్థలాలను మాత్రమే గుర్తించారు. వీటి ద్వారా రూ.2.40 కోట్లు వసూలు కావాల్సి ఉండగా కేవలం రూ.33 లక్షలు మాత్రమే వసూలు చేశారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేశాం



పన్ను వసూళ్ల కార్యక్రమాన్ని విస్తృతం చేశాం. ప్రతీ రోజు ఉదయం 8 గంటల నుంచి సచివాలయ సిబ్బందితో పాటు రెవెన్యూ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి సుమారు నెలకు రూ.2కోట్లు వసూలు చేస్తున్నాం. ఈ ఆర్థిక సంవత్సరాంతానికి లక్ష్యాన్ని చేరుకుంటాం.

- శివారెడ్డి, డిప్యూటీ కమిషనర్

ఆ..చీకటి రోజులు వెంటాడుతున్నాయ్..

పెద్ద నోట్ల రద్దుకి ఎనిమిదేళ్లు

6



ఏలూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది

ఇంటింటికీ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేంద్రకృష్ణ.. ఏలూరులో అవగాహన ర్యాలీ

ఏలూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికీ ఇంటివద్దే క్యాన్సర్ నిర్ధారణ పరీ క్షలు నిర్వహించడానికి కార్యాచరణ ప్రణాళికను చేపట్టామని జాతీయ అంటువ్యాధుల నివారణ కార్యక్రమం (ఎన్‌సీడీ) ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేంద్రకృష్ణ తెలిపారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏలూరులోని డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు రొమ్ము, నోటి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు, మధుమేహం, రక్తపోటు, రక్తహీనత పరీక్షలను ఇంటి వద్దే చేసి సమాచారాన్ని ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారన్నారు. అనుమానిత లక్షణాలున్నవారిని సమీప పీహెచ్‌సీ, జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేసి మెరుగైన చికిత్స అందిస్తారన్నారు. పాతబస్టాండ్ వద్ద మానవ హారాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మారేడుబాక అటవీ ప్రాంతంలో జామాయిల్ చెట్లను అక్రమంగా నరికివేసిన దృశ్యం

అక్రమంగా జామాయిల్ చెట్లు నరికివేత

కుక్కునూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు అటవీ రేంజ్ పరిధిలోని మారేడుబాక బీట్‌లో ఇటీవల అక్రమంగా జామాయిల్ చెట్లు నరికివేశారు. వనసంరక్షణ సమితి సభ్యులు అటవీశాఖ సంయుక్తంగా దాదాపు 15 ఏళ్ల నుంచి జామాయిల్ మొక్కలను పెంపకం చేస్తున్నారు. అటవీ శాఖ సంరక్షిస్తోంది. ఏపుగా పెరిగిన ఆ జామాయిల్ తోటలపై అక్రమార్కుల కన్ను పడింది. మారేడుబాక బీట్‌లో దాదాపు 60కి పైగా జామాయిల్ చెట్లు నరికి వేశారు. వాటిని కొంతదూరం తరలించి ముక్కలుగా చేసి జామాయిల్ తొక్కను తీస్తున్న క్రమంలో అటవీశాఖకు సమాచారం అందింది. దీంతో వాటిని స్వాధీనం చేసుకుని విలువను లెక్కించారు. అక్రమంగా చెట్లు నరికిన వ్యక్తి నుంచి రూ.40 వేలు (నరికిన కలప విలువకు నాలుగు రెట్లు అదనం) అపరాధ రుసుము వసూలు చేసినట్టు అటవీ శాఖాధికారులు చెబుతున్నారు.

రెండవ రోజు కొనసాగిన ఐటీ సోదాలు



7



గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ప్రముఖ సైకాలజిస్టు, హిప్నోథెరపిస్ట్ అక్కిం శెట్టి రాంబాబు

విద్యార్థులు కొత్తగా ఆలోచించాలి

సోషల్ మీడియాలో మంచిని మాత్రమే తీసుకోవాలి

సైకాలజిస్టు, హిప్నోథెరపిస్ట్ అక్కింశెట్టి రాంబాబు

దెందులూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు కొత్త ఆలోచనలతో పెరుగుతున్న టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని, సోషల్ మీడియాలో మంచిని మాత్రమే తీసుకుని ముందుకు వెళ్లాలని ప్రముఖ సైకాలజిస్టు, హిప్నోథెరపిస్ట్ అక్కింశెట్టి రాంబాబు, డాక్టర్ అశోక్ రెడ్డిలు అన్నారు. గురువారం దెందులూరు మండలం గోపన్నపాలెం సీతారామ ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియేల్ ఆధ్వర్యంలో 'యువత-విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం" అనే అంశపై అవగహన సదస్సు నిర్వహించారు.విద్యార్థులు సోషల్ మీడియాపై జాగ్రత్తగా ఉండాలని సోషల్ మీడియా వల్ల ఎంత లాభం ఉందో సక్రమంగా వినియోగించుకోకపోతే అందుకు రెండింతలు నష్టం ఉంటుందని అన్నారు. 15 సంవత్సరాల నుంచి 22 సంవత్సరాల వరకూ విద్యార్థులకు గోల్డెన్ పీరియడ్ అన్నారు. యువత మంచిగా అభివృద్ధి చెందాలన్నారు. సోషల్ మీడియాను ఒక సబ్జెక్టుగా మాత్రమే చూడాలి. అదే జీవితం అనుకుని యువత, విద్యార్థులు బానిసలయ్యారు. నేటి యువత, విద్యార్థులు క్రమ శిక్షణ పట్టుదలతో స్నేహ పూర్వక పోటీ తత్వంతో బాగా చదువుతూ మంచిమార్గం వైపు వెళ్లాలి. తల్లిదండ్రులు పిల్లల నడవడికను గమనిస్తూ వారిని గైడ్ చేస్తూ ఉండాలి. పరిస్థితి చేయిదాటిన తరువాత మన చేతుల్లో ఏమీ ఉండది. స్కూల్ లేదా కాలేజీలో వారి ప్రవర్తన ఏ విధంగా ఉంది.. ఇంట్లో ఉలా ఉంది.. తోటి వారితో ఏవిధంగా ఉందో తెలుసుకుంటూ ఉండాలలి. మనపిల్లల అభివృద్ధి మన చేతుల్లో ఉంటుందని రాంబాబు తెలిపారు. ఫస్ట్ ఎయిడ్ ట్రైనర్ సీపీఆర్ ట్రైనర్ చిన్ని సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చదు వుతో పాటు టెక్నాలజీ అభివృద్ధిలో స్నేహ పూర్వక పోటీతో ముందుకు వెళ్లాలన్నారు. ఏలూరు జిల్లా సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు దాసరి గణేష్, డాక్టర్ ప్రసాద్, కళాశాల ఉపాధ్యాయులు రత్న బాబు, డాక్టర్ సొంగా దీలీప్ కుమార్ పాల్గొన్నారు.



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు, బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభిస్తున్న గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియేల్

పాలకొల్లు డీఎన్ఆర్‌లో బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

పాలకొల్లు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని విద్యార్థి దశలోనే క్రీడలపట్ల ఆసక్తి కనపరచాలని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియేల్ అన్నారు. పాలకొల్లు డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం అంతర కళాశాలల మహిళా బ్యాడ్మింటన్ టోర్నమెంట్, యూనివర్శిటీ ఎంపిక పోటీలను నతానియేల్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తూ 3 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నదని తెలిపారు. ప్రతీ విద్యార్థిని క్రీడల్లో రాణించాలని సూచించారు. పోటీల్లో యూనివర్శిటీ పరిధిలోని 16 కళాశాలల నుంచి 60 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రమేష్ పర్యవేక్షించారు. యూనివర్శిటీ సెలక్షన్స్ పరిశీలకురాలు రత్నకుమారి, కార్యదర్శి గాదె జనార్ధన గుప్త, సభ్యులు చోడిశెట్టి వీర రాఘవస్వామి , కొండేటి సూరి బాబు, ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నాగలక్ష్మీ, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు రమేష్, వెంకట రమణ, సత్యనారాయణ, విజయస్వరూప్ సింగ్, మణిమాల, అధ్యాపకులు పాల్గొన్నారు.



వ్యాయామ ఉపాధ్యాయులతో గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న హెచ్‌ఎం సుధాకర్

చింతలపూడిలో 9,10 తేదీల్లో రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్

చింతలపూడి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో ఈనెల 9, 10 తేదీల్లో 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ టెన్నికాయిట్ పోటీలు అండర్-14, 17, 19 బాలబాలికల క్రీడోత్సవాలు ప్రభుత్వ పాఠశాలలో జరుగుతాయని గురువారం పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 78 టీమ్‌లు పాల్గొంటాయని, 390 మంది క్రీడాకారులు, 39 మంది కోచ్ మేనేజర్లు, 15 మంది టెక్నికల్ సిబ్బంది, 45 మంది ఆర్గనైజింగ్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొంటారు. పోటీలను జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ప్రారంభిస్తారు. జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ, స్కూల్ గేమ్స్ రాష్ట్రశాఖ కార్యదర్శి భానుమూర్తి రాజు, జిల్లా కార్యదర్శి అలివేలు మంగ, పరిశీలకులుగా ప్రకాశం జిల్లా నుంచి ఎన్.టి ప్రసాద్, పలువురు జిల్లా, మండల అధికారులు పాల్గొంటారని తెలిపారు. గురువారం వ్యాయామ ఉపాధ్యాయులతో పాఠశాల గ్రౌండ్‌ను పరిశీలించారు.



జాతీయస్థాయి పెయింటింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన పాలకొల్లు కళాకారులు

కళాకారులకు జాతీయ స్థాయి బహుమతులు

పాలకొల్లు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన 8మంది కళా కారులకు జాతీయస్థాయిలో పెయింటింగ్ పోటీల్లో బహుమతులు లభించాయి. ఇటీవల ఒంగోలులో సృష్టి ఆర్ట్ ఆకాడమీ జాతీయస్థాయి పెయింటింగ్ పోటీలు నిర్వహించగా పట్టణానికి చెందిన కడలి శ్రీనివాస్, కొసనా భాస్కర్, నక్కా వెంకట్, ఎస్‌కేడీ రవి, రమ్య, రాములకు బహు మతులు లభించినట్టు కడలి శ్రీనివాస్ గురు వారం తెలిపారు. తమతో పాటుగా తెలంగాణ, తమిళ నాడు, ఒడిశా, కర్నాటక తదితర రాష్ట్రా లకు చెందిన ఆర్టిస్టులు సుమారు 100 మంది పాల్గొన్నారని తెలిపారు. ప్రాచీన భారతానికి సంబంధించిన అంశంపై పెయింటింగ్ వేశామన్నారు. బహుమతులు సాధించిన ఆర్టిస్టును పట్టణ ప్రముఖులు అభినందించారు.

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఏలూరు విద్యార్థులు

ఏలూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఏలూరు సాయి సెంటర్ వెయిట్ లిఫ్టర్లు ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించారని, సాయిసెంటర్ ఇన్‌ఛార్జ్ వినాయక ప్రసాద్ తెలిపారు. ఆరుగురు మహిళలు పోటీలో పాల్గొన్నారని తెలిపారు. అండర్ -17 స్టేట్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని ఎం.పావని బంగారు పతకం, జి.పవిత్ర రజిత, సిహెచ్ కీర్తన బంగారు పతకం, సిహెచ్ హారికారెడ్డి వెండి, కె.మేఘన రజత, ఎస్.విహారిక రజత పతకాలు సాధించారని తెలిపారు. వీరిలో పావని, కీర్తి, డిసెంబర్ 2 నుంచి 8వ తేదీవరకు మణిపూర్‌లో జరిగే అండర్ -17 జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారని వినాయక ప్రసాద్ తెలిపారు.







ఆ..చీకటి రోజులు వెంటాడుతున్నాయ్

పెద్ద నోట్లను రద్దు చేస్తూ (డీమానిటైజేషన్) కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి నేటికి ఎనిమిదేళ్లు నిండాయి. రూ.1000, రూ.500 నోట్లు రద్దుతో పెద్ద ఎత్తున నల్లధనం బయటకు వస్తుందని దేశంలో ఉగ్రవాదం తగ్గుతుందని పేద మధ్య తరగతి వర్గాలకు లాభం చేకూరు తుందనే ఉద్దేశ్యంతో ప్రధాని మోదీ 2016 నవంబరు 8వ తేదీ రాత్రి తీసుకున్న నిర్ణయాన్ని దేశ ప్రజలు స్వాగతించారు. అయితే పెద్దనోట్లు రద్దుతో 2017 సంవత్సరాంతం వరకూ నగదు కొరతతో సామాన్య మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. బ్యాంకు ఖాతాలలో సొమ్ము ఉన్నప్పటికీ చేతిలో ఖర్చులకు నగదు లేక నానా అవస్థలు పడ్డారు.. ఆ రోజులు తలచుకుంటే ఇప్పటికీ అమ్మో అని అనుకుంటుంటారు..

పెద్ద నోట్ల రద్దుకు ఎనిమిదేళ్లు
ఉనికి కోల్పోయిన రియల్ ఎస్టేట్
కుదేలైన నిర్మాణ రంగం
ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం
ఉమ్మడి జిల్లాలో తిరోగమనం

పాలకొల్లు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ ఎనిమిదేళ్ల కాలంలో 50 వేల కోట్లు రూపాయలకు పైబడి ఆర్థిక లావాదేవీలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలపై నోట్ల రద్దు ప్రభావం తీవ్రంగానే కనిపించింది. మెత్తంగా వాణిజ్య వర్గాలపైనా ఆ ప్రభావం పడింది. పెద్ద నోట్లు రద్దుకు ముందు రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక వెలుగు వెలిగింది. జిల్లాలో ఏడాదికి వెయ్యి ఎకరాలకు తక్కువ కాకుండా లేఅవుట్లు వేసేవారు. అయితే నోట్లు రద్దు అనంతరం నగదు చలామనీపై అంక్షలు, ఆర్థిక లావాదేవీలపై ఐటీ కన్ను తదితర పరిణామాల నేపథ్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం నాలుగింట ఒకవంతుకు పడిపోయింది. గడిచిన ఎనిమిదేళ్లలో జిల్లాలో ఒక్క రియల్ ఎస్టేట్ రంగంలోనే రూ.20 వేల కోట్లుకు పైబడి నష్టాలు ఉంటాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే 2016కు ముందు ఇళ్ల స్థలాలు, భూముల ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడూ అదే విధంగా ఉండటం అందుకు ఉదాహరణగా చెబుతున్నారు.



కుదేలైన నిర్మాణ రంగం

ఉమ్మడి జిల్లాలో నిర్మాణ రంగం కుదేలైంది. పెద్ద నోట్లుకు రద్దుకు తోడు కరోనా, 2019లో ప్రారంభమైన జగన్ రెడ్డి దుష్టపాలన నిర్మాణ రంగాన్ని కనిష్ట స్థాయికి దించాయి. పెద్ద నోట్లుకు రద్దుకు ముందు నిర్మించిన వ్యక్తిగత భవనాలు రెండు, మూడు బెడ్ రూంల ప్లాట్లు జిల్లాలో పట్టణాలు వారీగా ఇంకా వందల సంఖ్యలో అమ్ముడు పోకుండా ఉన్నాయి. ఈ కష్టాలకు తోడు జనంలో కొనుగోలు శక్తి తగ్గడం నిర్మాణ రంగాన్ని మరింత క్షీణ దశకు తెచ్చాయి.

అన్ని రంగాల పైనా ప్రభావం

పెద్ద నోట్లు రద్దు వల్ల లాభాలు ఏమేరకు ఉన్నాయో చెప్పలేం కానీ అన్ని రంగాలపైనా నోట్ల రద్దు ప్రభావం పడింది. వ్యాపారాలు తిరోగమనం పట్టాయి. రూపాయి మారకం విలువ తగ్గడం మరో వైపు డాలర్ విలువ పడిపోవడంతో ఆ ప్రభావం మరింతగా కనిపించింది. ఇప్పటికీ కొన్ని రంగాలు కోలుకోలేని పరిస్థితి ఏర్పడింది.

ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం

కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందాన పెద్ద నోట్లు రద్దుతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. సామాన్య మధ్య తరగతిలో కొనుగోలు శక్తి కనిష్ట స్థాయికి పడిపోయింది. సాధారణంగా ప్రతీ ఏటా నిత్యావసరాల కొనుగోలు 10 నుంచి 15 శాతం వృద్ధి చెందుతూ ఉంటుంది. రూపాయి మారకం విలువ పెరిగిన కొనుగోళ్లు లెక్కించి ఈ నిష్పత్తిని అంచనా వేస్తారు. విచిత్రం ఏమిటంటే ఇప్పుడు మార్కెట్‌లో 2016 నాటి పరిణామాలే కనిపిస్తున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని ప్రధాన పట్టణాలలో మూడింట ఒక్కింట షాపులు అద్దెలు కట్టలేక, వ్యాపారాలు లేక ఖాళీ చేసే పరిస్థితి ఏర్పడింది.

ఉమ్మడి జిల్లాలో తిరోగమనం

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అన్ని రంగాలపైనా ఆర్థిక తిరోగమనం కనిపిస్తుంది. పెద్ద నోట్లు రద్దు అనంతరం కరోనా ఆ తర్వాత ఐదేళ్ల దుష్టపాలన జిల్లాలో ఆర్థిక పరిస్థితిని కుంగదీశాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు అయినప్పటికీ జిల్లాలో ఆర్థిక రంగంలో చెప్పుకోదగ్గ మార్పులు కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లాలో సుమారు 40 లక్షలు మంది జనాభా ఉండగా 90 శాతం పేద సామాన్య, మధ్య తరగతి ప్రజలే ఉన్నారు. జిల్లాలో గత ఐదేళ్లలో ఆదాయం వనరులు తెచ్చిపెట్టే అన్ని వ్యాపారాలకు కష్టాలు తప్ప లేదు. ఉమ్మడి జిల్లాకు ఆదాయం తెచ్చిపెట్టే ఆక్వాకు చేయూతనివ్వకపోవడంతో మొత్తంగా ఆర్థిక లావాదేవీలు క్షీణస్థితికి చేరాయి. భవన నిర్మాణ రంగానికి సంబంధించి సుమారు 50 అనుబంధ వ్యాపారాలు కుంటుపడ్డాయి.

నోట్ల రద్దు, జీఎస్టీలు కొంప ముంచాయి



గత ఎనిమిదేళ్ల కాలంలో అమ్మకాలు గణ నీయంగా తగ్గిపోయాయి. ప్రతీ ఏటా 10 నుంచి 20 శాతం పెరుగుతాయి. అయితే భవన నిర్మాణ రంగం తిరోగమనంతో ప్లంబింగ్, శానిటరీ వ్యాపారం కనిష్ట స్థాయికి తగ్గి పోయింది. పెద్ద నోట్ల రద్దుకు తోడు జీఎస్టీ కలవడంతో వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపించింది. పూర్వవైభవానికి వేచి చూడాల్సిందే.

బంగారు శశిధర్, వ్యాపారి, పాలకొల్లు

నిర్మాణ రంగానికి తీవ్ర నష్టం



నోట్ల రద్దు భవన నిర్మాణాలపై తీవ్ర ప్రభావం చూపించింది. అధిక శాతం బిల్డర్లు నష్టాలను చవి చూశారు. నగదు కొరత, నగదు చలామణిపై అంక్షలు, ఆన్‌లైన్ లావాదేవీలు, ఐటీ ఇబ్బందులతో భవనాలు కొనుగోలు చేయడానికి ఆలోచనలో పడుతున్నారు. నిర్మించిన ఇళ్ల అమ్మకాలు జరగడం లేదు.

దేవళ్ళ రవి కిరణ్, బిల్డర్, పాలకొల్లు

4 శాతం ప్రజల వద్దే ఉండిపోయాయి



రద్దయిన పాత 500, 1000 నోట్లు ఇంకా 4 శాతం ప్రజల వద్దనే ఉండిపోయాయి. నోట్ల రద్దు నిర్ణయం పరోక్షంగా పేద, మధ్య తరగతి రంగాలను ఆర్థికంగా కుంగదీసింది. మరో వైపు ఆర్థిక లావాదేవీలపై అంక్షలు ప్రతి కూల ప్రభావాన్ని చూపించాయి. పెద్ద నోట్ల రద్దు దేశాభివృద్ధిని పదేళ్ళ వెనక్కి నెట్టింది.

పెద్దిభొట్ల లక్ష్మీనారాయణ, ఆడిటర్



బాలికల విభాగంలో ఛాంపియన్‌గా అనంతపురం జిల్లా జట్టు

అండర్-14 అథ్లెటిక్స్ విజేతలు

ఉంగుటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం హైస్కూలులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 బాల,బాలికల అథెటిక్స్ పోటీలు గురువారంతో ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీలు కైకరం, నారాయణపురం చింతలపాటి బాపిరాజు స్టేడియంలో జరిగాయి. బాలికల ఛాంపియన్‌గా అనంతపురం జిల్లా, బాలుర ఛాంపియన్‌గా కడప జిల్లా జట్లు విజయం సాధించాయి. వారికి పోటీల రాష్ట్ర పరిశీలకుడు ప్రసాద రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కే.అలివేలు, ఆర్గనైజింగ్ అధ్యక్షుడు గుళ్ల ప్రసాదరావు పీడీలు నాగసుధ, పాపాయమ్మ, విద్యా కమిటీ ఛైర్మెన్ అల్లూరి జగదీశ్వరి, వైస్ చెర్మన్ బలరాం బహుమతులు అందజేశారు.

ఆర్చరీ పోటీల్లో తిరుమల విద్యార్థులకు స్వర్ణ పతకాలు



భీమవరం ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మన్యం జిల్లాలోని పార్వతీపురంలో ఇటీవల నిర్వహించిన 68వ ఏపీఎస్‌జీ ఎఫ్ ఇంటర్ డిస్ట్రిక్ ఆర్చరీ టోర్నమెంట్ 2024- 25, అండర్-19 బాలికల విభాగంలో భీమవరం తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు స్వర్ణ, వెండి పతకాలు సాధించారని విద్యా సంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. గురువారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో భాగంగా డైరెక్టర్ ఎస్.సాయిరాజు మాట్లాడుతూ ఆర్చరీ టోర్నమెంట్‌లో రెండు సువర్ణ పతకాలు సాధించిన కెంగన్ శరణ్య, వెండి పతకాలు సాధించిన రవ్వడ రూప చంద్రహాసినిలను అభినందించారు.

10 నుంచి మన్యసీమ దర్శిని ప్రత్యేక సర్వీసు

శ్రీశైలానికి ప్రతీ ఆదివారం రాత్రి బస్సు ఏర్పాటు



మన్యసీమ దర్శిని బ్రోచర్ ఆవిష్కరించిన డీఎం సత్యనారాయణమూర్తి

భీమవరం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వినోద విజ్ఞానాలతో పాటు మానసికోల్లాసం కలిగించే ఆహ్లాదకరమైన మన్యసీమ దర్శిని యాత్ర ఈనెల 10వ తేదీ నుంచి భీమవరం డిపో నుంచి ప్రారంభిస్తున్నామని ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి తెలిపారు. 10తేదీన ఉదయం 4 గంటలకు బస్సు సర్వీసు పంపుతున్నామన్నారు. భీమవరం నుంచి బస్సు బయలుదేరి కోరుకొండ లక్ష్మి నరసింహస్వామి ఆలయం, సీతపల్లి గడి పాపమ్మ ఆలయం, మారేడుమిల్లి కాఫీ గార్డెన్స్, మిరియాల గార్డెన్స్ రబ్బర్ ప్లాంటే షన్, ఔషధ మొక్కలు, జలతరంగిని వ్యూ పాయింట్, పాములేరు వాగు దర్శించి తిరుగు ప్రయాణంలో రాజమండ్రి ఇస్కాన్ టెంపుల్ పుష్కరాల రేవు మీదుగా రాత్రి 10 గంటలకు భీమవరం చేరుకుంటుందని తెలిపారు. ఎక్స్‌ప్రెస్ రూ.600, ఆల్ట్రాడీలక్స్ రూ.700 చొప్పున చార్జీలు ఉంటాయన్నారు. ప్రయాణికులు కోరినరోజు వారు కోరిన ప్రదేశానికి బస్సులు పంపిస్తామని, ఈ బస్సుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. వివరాలకు 96660 89036, 08816-239100 నంబర్లలో సంప్రదించవచ్చునన్నారు. శ్రీశైలానికి బస్‌కాంప్లెక్స్ నుంచి ప్రతీ ఆదివారం రాత్రి సర్వీసును నడుపుతున్నామని తెలిపారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం,సామర్లకోటలోని మహా శివుడిని దర్శించుకోవడానికి ఈ కార్తీక మాసంలో ప్రతీ ఆదివారం రాత్రి భీమవరం డిపో నుంచి పంచారామ దర్శిని టూర్ ప్యాకేజీలో బస్సులను నడుపుకతున్నట్టు డిపో మేనేజర్ మూర్తి తెలిపారు. అడ్వాన్స్ బుకింగ్ చేసుకొనే భక్తులు భీమవరం బస్టాండ్ రిజర్వేషన్ కౌంటర్‌లో సంప్రదించవచ్చునన్నారు. శబరిమలై, శ్రీశైలం యాత్రలు చేసే భక్తుల కోసం ఇతర విహార యాత్రలకు అద్దె ప్రాతిపదికన బస్సులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన చిక్కీలపై విద్యాశాఖ విచారణ

ద్వారకాతిరుమల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'తుప్పు వాసన చిక్కీలు' పేరిట ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించారు. మండల విద్యాశాఖాధికారులనే విచారణాధికారులుగా నియమించడంతో వారు ఈ సమస్యను తూతూమంత్రంగా విచారించి ముగించారని విద్యార్థుల తల్లితండ్రులు ఆరోపిస్తున్నారు. ద్వారకాతిరుమల ఎంపీ యూపీ పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకంలో భాగంగా విద్యార్థులకు కాలం చెల్లిన చిక్కీలు పెట్టారని ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. విద్యార్థులకు ఇలాంటి చిక్కీలు ఇచ్చారేంటి అని తల్లిదండ్రులు, స్థానికులు అడిగినప్పుడు మాకు పైనుంచి ఇవే వచ్చాయి.. అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పిన హెచ్‌ఎం ఇపుడు ఎంఈవోల విచారణలో మాట మార్చారని విద్యార్థుల తల్లితండ్రులు అంటున్నారు. పని ఒత్తిడి అన్న పేరుతో తప్పించుకున్నారు. అయితే పని ఒత్తిడిలో కాలం చెల్లినవి విద్యార్దులకు ఇస్తే అవి వారికి ఏదైనా తీవ్ర ఆరోగ్య సమస్యను తెస్తే ఎవరు బాధ్యత వహిస్తారన్నది సంబంధిత విచారణాధికారులు తేల్చలేదు. కొత్త స్టాకు ఉన్నప్పటికీ పాత స్టాకు ఇచ్చినట్లు ఒప్పుకున్నారు. దానిని నిర్లక్ష్యంగా భావించని సదరు విచారణాధి కారుల సమర్థింపు హాస్యాస్పదంగా ఉంది. కాలం చెల్లిన చిక్కీలను విద్యార్థుల నుంచి వెనక్కు తీసుకున్నామని హెచ్‌ఎం విచారణలో వివరణ ఇచ్చారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

పుష్కరాల ఏర్పాట్లపై పక్కా ప్రణాళికలు రూపొందించండి:కలెక్టర్

భీమవరం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై పక్క ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మితో కలిసి సమీక్షించారు. 2027లో గోదావరి పుష్కరాలు జరుగనున్నాయని, దీనికి సంబంధించిన ఏరాట్లపై ముందు నుంచే పక్కా ప్రణాళికతో ఉండాలని సూచించారు. జిల్లాలో ప్రధానంగా 33 పుష్కర ఘాట్లు ఉన్నాయని, ఆచంట, నరసాపురం, పెనుగొండ, యలమంచిలి మండలాల తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో చేయవలసిన ఏర్పాట్లపై సమీక్షించి నివేదికలను సమర్పించాలన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పార్కింగ్, బందోబస్తు ఏర్పాట్లను చూడాలన్నారు. పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ పనులను చేపట్టా లని సూచించారు. ఆర్అండ్‌బీ శాఖ రహదారులు, అంతర్గత రహదారులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీరు, క్లోరినేషన్ తదితర అంచనాలను రూపొందించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ బందోబస్తు, పార్కింగ్ ప్రణాళికలను సిద్ధం చేశామని, అలాగే అదనపు సిబ్బంది ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, నరసాపురం ఆర్డీవో దాసి రాజు, జలవనుల శాఖ అధికారి నాగార్జున, డీపీవో అరుణశ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నాగేశ్వరరావు, ఇంజనీరింగ్ అధికారి క్షేశ్రీనివాసరావు, ఆచంట, నరసాపురం, పెనుగొండ, యలమంచిలి తహసీల్దార్లు పాల్గొన్నారు.

బీసీ కులగణనపై ప్రభుత్వం స్పందించాలి

భీమవరంటౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బీసీల కుల గణన విషయంపై ఏపీ ప్రభుత్వం స్పందించాలని అన్ని విషయాల్లో బీసీలకు అన్యాయం జరుగుతోందని జాతీయ బీసీ సంక్షేమ జాతీయ అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జాతీయ బీసీ ప్రజా సంక్షేమ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరమామిడి గంగారామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. ఈనెల 12న ఉదయం 10 గంటలకు చంద్రిక ఫంక్షన్ హాల్‌లో జాతీయ బీసీ ప్రజా సంక్షేమ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశామని. సమావేశంలో బీసీల ప్రజా సంక్షేమం కోసం పూర్తి స్థాయిలో చర్చ జరుగుతుందన్నారు. జాతీయ ఉపాధ్యక్షుడు చింతాడ శ్రీనివాస్, బీసీ నాయకులు చెప్పాడ చంద్రశేఖర్, సూరిశెట్టి కల్యాన, క్షత్రియ నర్సింగ్ మాట్లాడారు.

గుడ్డుకు మంచిరోజులు



రెండు రోజులుగా పెరిగిన ధర
ఊపిరి పీల్చుకుంటున్న పౌల్ట్రీ రైతులు

తణుకు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెరిగిన గుడ్డు ధరలతో పౌల్ట్రీ పరిశ్రమకు పెద్ద ఉపశమనం కలిగింది. ప్రస్తుతం గుడ్డు ధర 5 రూపాయలు నుంచి 5.50 పైసలు పెరిగింది. గత రెండు రోజులుగా ఈ ధర ఉంది. రానున్న జనవరి వరకు ఇదే ధరలు కొనసాగితే కొంత మేరకు రుణాలు తీర్చుకోవచ్చని పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు. రెండు రోజుల క్రితం వరకు గుడ్డు ధర రూ. 5 ఉండేది. రిటైల్ మార్కెట్లో ఏడు రూపాయలకు విక్రయిస్తున్నారు. వేసవికాలంలో అనేక రకాలుగా ఇబ్బందులు పడిన రైతులకు ప్రస్తుతం చలికాలం కావడంతో వినియోగం పెరిగింది. వేసవిలో కోళ్ళు నీరు తాగడం వల్ల గుడ్ల ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం చలివల్ల మేత కూడా తినడం వల్ల గుడ్డుల ఉత్పత్తి కూడా పెరిగింది. దానికి తోడు ఈశాన్య రాష్ట్రాలకు ఎగుమతులు అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో కోటి 70 లక్షల కోళ్ళ సామర్థ్యం ఉన్నప్పటికి ఆయా రైతులు వద్ద కోటి 40 లక్షల కోళ్ళు మాత్రమే ఉన్నాయి. వాటి నుంచి ప్రతి రోజు కోటి 10 లక్షల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. స్థానికంగా సగం వరకు గుడ్లు వినియోగిస్తారు. మిగిలిన సగం ఈశాన్య రాష్ట్రాలైన పశ్చిమ బెంగాల్, బీహార్, అసోం రాష్ట్రాలకు రోజూ 30 లారీలు వెళుతుంటాయి. ధరలు పెరుగుదలతో రైతులు కొద్దిగా కోలుకునే పరిస్థితి కనిపిస్తున్నది.

ఈ ధర నిలకడగా ఉండాలి



పెరిగిన గుడ్డు ధరలు నిలకడగా ఉండాలి. ప్రస్తుతం రైతులకు ఉపశమనంగానే ఉంది. ఇప్పటి వరకు అనేక ఎత్తుపల్లాలు రైతులు ఎదుర్కొన్నారు. నష్టాలు భరించలేక చాలా మంది ఇతర రంగాల వైపు మళ్లుతున్నారు. ఇలాంటి ధరలు వల్ల పరిశ్రమకు మంచిరోజులు వచ్చినట్లు భావించాలి.

మల్లిన శ్రీనివాసరావు, నెక్ గోదావరి జోనల్ ఛైర్మన్

నేడు ఉమ్మడి జిల్లా మత్స్య సొసైటీ ఎన్నిక

నరసాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల మత్స్య సహకార సంఘం ఎన్నిక శుక్రవారం ఏలూరులో జరగనున్నది. మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో జరిగే ఎన్నికకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉభయ జిల్లాల్లో మొత్తం 130 సొసైటీల అధ్యక్షులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. వీరంతా జిల్లా అధ్యక్షుడుతో పాటు 10 డైరెక్టర్లను ఎన్నుకోనున్నారు. ఈ సంఘానికి ఎండీగా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీష్ అధికారి కొనసాగుతారు. అయితే ఈసారి ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారింది. గత 15ఏళ్ల నుంచి జిల్లా సంఘం అధ్యక్షులుగా నరసాపురం ప్రాంతానికి చెందిన ఆంద్రాజు చల్లారావు కొనసాగుతున్నారు.

12న బహుమతులు అందజేత

భీమవరం అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బాలల దినోత్సవం పుర స్కరించుకుని సర్వోద మండలి ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన రచనల పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి ఈ నెల 12వ తేదీన బహుమతులు అందజేస్తామని సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకురి ప్రసాదరాజు తెలిపారు. ఈ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నగా వీరిలో 18 మంది విజేతలుగా నిలిచారన్నారు. వీరిలో ఏలూరు జిల్లా వారికి పెదనిండ్రకొలను మహాత్మగాంధీ భవనంలోపే, పశ్చిమగోదావరి జిల్లా బాలలకు భీమవరం జెఎల్‌బీ మునిసిపల్ బాలికల పాఠశాలలో బహుమతులు అందజేస్తామన్నారు.

బాండ్‌లు గోవిందా!



- వైసీపీ హయాంలో రూ. 900 కోట్లు విలువ
- కూటమి ప్రభుత్వంలో సీన్ రివర్స్
- వ్యవసాయ భూముల ఆధారంగా టీడీఆర్ బాండ్‌లు జారీ
- వైసీపీ నేతకు చెంప పెట్టు
- బాండ్‌ల విలువ రూ. 100 కోట్లు
- ప్రభుత్వానికి మిగులు రూ. 800 కోట్లు
- ఘొల్లుమంటున్న బాండ్‌ల కొనుగోలుదారులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తణుకు మునిసిపాలిటీలో జారీ చేసిన టీడీఆర్ బాండ్‌లపై రాష్ట్ర ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వంలో జారీ చేసిన బాండ్‌లు రద్దయ్యాయి. వాటి స్థానంలో కొత్త బాండ్‌లు జారీ చేస్తోంది. వైసీపీ హయాంలో మునిసిపాలిటీ అవసరాల కోసమని 29 ఎకరాల వ్యవసాయ భూమిని సేకరించారు. వాటిని గజాల లెక్కన మునిసిపాలిటీ బాండ్‌లు ఇచ్చేసింది. ఈ వ్యవహారంలో వైసీపీ నేత కీలక పాత్ర పోషించారు. పెద్ద మొత్తంలో లబ్ధిపొందారు. ఇప్పుడా బాండ్‌లకు కాలం చెల్లింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దిద్దుబాటు చర్యలు చేపట్టింది. వ్యవసాయ భూముల ప్రామాణికంగా బాండ్‌లు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. వైసీపీ హయాంలో ఒక గజానికి నాలుగు రెట్లు వంతున బాండ్‌లు జారీచేశారు. అంటే 29 ఎకరాల సేకరణ కోసం రూ. 900 కోట్ల విలువైన బాండ్‌లను జారీచేశారు. ఈ క్రమంలో దాదాపు రూ. 400 కోట్లు చేతులు మారాయి. కూటమి ప్రభుత్వం టీడీఆర్ బాండ్‌ల అక్రమాలపై ఉక్కుపాదం మోపింది. ఎకరాల లెక్కన బాండ్‌లు జారీ చేయాలని ఆదేశాలు జారీచేసింది. ఆ దిశగా మునిసిపాలిటీ చర్యలు తీసుకున్నది. వైసీపీ ప్రభుత్వంలో తణుకు మునిసిపాలిటీ 29 మంది యజమానులకు బాండ్‌లు మంజూరు చేశారు. వాటిని రద్దుచేసి కొత్తగా మళ్లీ ఆన్‌లైన్‌లో మునిసిపాలిటీ జారీ చేస్తోంది. ఇప్పటి వరకు 19 బాండ్‌లను ఇచ్చింది. మరో 10 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. అవి కూడా త్వరలోనే జారీ కానున్నాయి. దీనివల్ల స్థల యజమానులు భారీగా నష్టపోనున్నారు. అంతిమంగా టీడీఆర్ బాండ్‌లు కొనుగోలు చేసిన వారంతా పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయారు. నేనున్నానంటూ భరోసా ఇచ్చిన వైసీపీ నేత చేతులెత్తేశారు. ప్రభుత్వానికి మాత్రం భారీ లబ్ధి చేకూరింది.

ఎకరానికి రూ. 2 కోట్లు మాత్రమే

వ్యవసాయ భూములు ఆధారంగా టీడీఆర్ బాండ్‌లు మంజూరు చేస్తుండడంతో ఎకరానికి కేవలం రూ. 2.00 కోట్లు లోపు మాత్ర మే లబ్ధి చేకూరుతుంది. రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగానే భూమి ధరను లెక్కిస్తారు. గతంలో గజాలు లెక్కన రిజిస్ట్రేషన్ విలువను పరిగణలోకి తీసుకున్నారు. ఒక్కో గజానికి రూ. 20వేల వరకు ధరను నిర్ణయించారు. అంతకు నాలుగు రెట్లు విలువైన బాండ్‌లు జారీచేసేశారు. అంటే గజం విలువ రూ. 80వేలు అయ్యింది. ఎకరం విలువ దాదాపు రూ. 40 కోట్లకు చేరుకుంది. కంపోస్టు యార్డు వద్ద సేకరించిన 10 ఎకరాల భూమికి సంబంధించిన బాండ్‌ల విలువ రూ.400 కోట్లు అయ్యింది. అదే గ్రీన్‌జోన్ కోసం మరో 19 ఎకరాలు సేకరించారు. అదికూడా గజాలు లెక్కన బాండ్‌లు మంజూరు చేశారు. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం దానివిలువ రూ.500 కోట్లు వరకు ఉంటుంది. ఇలా రూ.900 కోట్లు విలువైన బాండ్‌లు అప్పట్లో జారీ అయిపోయాయి. మునిసిపాలిటీ లేదా ప్రభుత్వం వద్ద భూసేకరణకు సొమ్ములు లేనట్టయితే బాండ్‌లు రూపంలో స్థల యజమానులకు లబ్ధి చేకూరుస్తుంది. వాటిని విక్రయించడమో లేదా సొంతానికి వినియోగించుకుని స్థల యజమానులు లబ్ధిపొందనున్నారు. వైసీపీ హయాంలో గజాల రూపంలో బాండ్‌లు జారీచేయడంలో కోట్లాది రూపాయలు చేతులు మారాయి. బాండ్‌లు పొందిన యజమానులు ఇతరులకు విక్రయించేశారు. మార్కెట్‌లో 40 నుంచి 50శాతానికి బాండ్‌లు కొనుగోలు చేసుకుంటారు. అసల ధరకు సమానుగా ప్లాన్ లేకుండానే అదనపు నిర్మాణాలు చేపడుతుంటారు. ప్రభుత్వం ఆ అవకాశం కల్పించింది. విశాఖపట్నం, విజయవాడలో టీడీఆర్ బాండ్‌లకు డిమాండ్ ఉంది. తణుకు మునిసిపాలిటీలో బాండ్‌లు విక్రయించిన యజమానులు దాదాపు రూ. 400 కోట్ల మేర లబ్ధిపొందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ రివర్స్ అయ్యింది. బాండ్‌లు పనికిరాకుండా పోయాయి. కొత్తగా ఎకరాలు లెక్కన జారీ చేస్తున్నారు. దాంతో బాండ్‌ల కొనుగోలు దారులు దిక్కుతోచని స్థితిలో కొట్టు మిట్టాడుతున్నారు.

బఫర్ జోన్ అడ్డంకి

తణుకు మునిసిపాలిటీలో ఆరు ఎకరాల విస్తీర్ణంలో కంపోస్టు యార్డు విస్తరించి ఉంది. అది బఫర్ జోన్‌గా గుర్తించారు. అక్కడ మరో 10 ఎకరాలు మునిసిపాలిటీ సేకరించింది. గజాల లెక్కన వైసీపీ ప్రభుత్వంలో బాండ్‌లు ఇచ్చారు. అదికూడా రియల్టర్‌లు రైతులనుంచి ముందుగా కొనుగోలు చేసి ఒప్పందం చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ కాకుండానే రియల్టర్‌లు తమ పేరుమీద బాండ్‌లు తీసుకున్నారు. ఇప్పుడు అక్కడ ఎకరానికి కేవలం రెండు ఎకరాలు మాత్రమే బాండ్‌లు రూపంలో ఇస్తున్నారు. అంటే 20 ఎకరాలకు బాండ్‌లు జారీచేశారు. రిజిస్ట్రేషన్ విలువ ఎకరానికి అక్కడ కోటి రూపాయలు కూడా లేదు. అంటే 10 ఎకరాల భూమిని మున్సిపాలిటీ ఇప్పుడు రూ.20 కోట్లు లోపే సేకరించినట్టయ్యింది. ఇదిలా ఉంటే గ్రీన్ జోన్‌లో ఉన్న 19 ఎకరాల్లో 1.50 ఎకరాలు బఫర్ జోన్‌లో ఉన్నాయి. కాలువ విస్తరించి ఉండడంతో 1.50 ఎకరాలకు రెండురెట్లు వంతున 3 ఎకరాలకు బాండ్‌లు ఇచ్చారు. రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా వాటికి ధర లభించనుంది. మిగిలిన 17.50 ఎకరాలకు మాత్రం నాలుగు రెట్లు అంటే 70 ఎకరాలకు బాండ్‌లు మంజూరు చేస్తున్నారు. గ్రీన్ జోన్ పరిధిలో మున్సిపాలిటీ సేకరించిన 19 ఎకరాలకు సరిపడా 73 ఎకరాలకు బాండ్‌లు జారీచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎకరాల ప్రాతిపదికన ఇచ్చే బాండ్‌ల విలువ మొత్తం రూ. 100 కోట్లు వరకు ఉంటుంది. అంటే ప్రభుత్వానికి రూ. 800 కోట్లు మిగిలినట్టయ్యింది.

విచారణ వేగవంతం

తణుకు మునిసిపాలిటీలో గ్రీన్‌జోన్, కంపోస్టు యార్డు కోసం గతంలో సేకరించిన భూమి, టీడీఆర్ బాండ్‌ల జారీపై ప్రభుత్వం చేపట్టిన విచారణ వేగవంతంగా నిర్వహిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు విడతల వారీగా మునిసిపాలిటీని సందర్శిస్తున్నారు. వివరాలు సేకరిస్తున్నారు. మరోవైపు సీబీసీఐడీ కూడా ప్రాథమికంగా వివరాలను రాబట్టింది. ఇప్పటికే వైసీపీ హయాంలో బాండ్‌లు జారీచేసిన అధికారులు బలయ్యారు. బాండ్‌లు కొనుగోలు, సొమ్ముల లావాదేవీలో ఉండే వారంతా సీబీసీఐడీ దర్యాప్తులో చిక్కుకునే అవకాశాలు ఉన్నాయి.



కొండ చిలువ హతం

యనమదుర్రు కాల్వ వెంబడి పొదల్లోంచి వచ్చిన పాము

భీమవరం క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భీమవరం 28వ వార్డు సుంకర విజయలక్ష్మీనగర్‌లో నడిరోడ్డుపై కొండ చిలువ హల్‌చల్ చేసింది. రోడ్డుపైకి వచ్చిన ఏడు అడుగుల కొండ చిలువను చూసి స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఆ ప్రాంగణంలో వీధి లైటు లేదు. పైగా యనమదుర్రు కాలువ గట్టున పొదలు ఉండటంతో అది పొదల్లో నుంచి రోడ్డు మీదకు వచ్చింది. అక్కడ స్థానికులు అంతా కలిసి భయపడి దాన్ని అక్కడ ఉన్న యువకులు తెలియజేయడంతో దాన్ని హతమార్చారు. ఇటీవల టూటౌన్ పరిధిలో కూడా ఒక కొండ చిలువ రోడ్డుపైకి వచ్చిన సంగతి తెలిసిందే. అధికారులు చొరవ తీసుకుని యనమదుర్రు కాలువ గట్టు వెంబడి లైట్లు ఏర్పాటు చేయాలని, కాలువ గట్లపై ఉన్న పొదలను తొలగించాలని కోరారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, బాధితులు

ఆకివీడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణలు తొలగింపులో భాగంగా ఇళ్లకు నోటీసులు ఇవ్వకుండా ముందుగానే విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేయడం దుర్మార్గమని సీపీఎం పట్టణ అధ్యక్షుడు కె.తవిటినాయుడు అన్నారు. స్థానిక అయి-భీమవరం రోడ్‌లోని ఇళ్ళకు కరెంటు ఇవ్వడంలేదంటూ గురువారం రాత్రి స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర సీపీఎం నేతలతో కలిసి బాధితులు ధర్నా నిర్వహించారు.

ఆక్రమణల తొలగింపునకు సర్వే

వెంకయ్య వయ్యేరు కాలువ గట్టున ఆక్రమణలు వలన నీరు కలుషితమవుతుండడంతో తొలగింపుకు చర్యలు చేపట్టామని నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక బైపాస్ రోడ్ సర్వే చేసి మాట్లాడారు. రహదారి అభివృద్ధి పరిచే దిశగా అయి-భీమవరం రోడ్ నుంచి పెద్ద వంతెన వరకూ సర్వేచేసి ఆక్రమణలు తొలగిస్తే ట్రాఫిక్ నియంత్రించ వచ్చునన్నారు. కార్యక్రమంలో టీపీవో రాధాకృష్ణ, సర్వేయర్లు ఉన్నారు.

రెండోవ రోజు కొనసాగిన ఐటీ సోదాలు

అందుబాటులో లేని వ్యాపారవేత్త



ఆర్‌ఆర్‌పేటలో సేఫ్ మ్యాక్ సొసైటీ

ఏలూరు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వ్యాపారవేత్త నూకల రామకృష్ణ ఇంటిపైన, ఆయనకు సంబంధించిన ఆస్తులపై రెండవ రోజు కూడా సెంట్రల్ ఇన్‌కమ్‌టాక్స్ అధికారులు సోదాలు కొనసాగించారు. తమిళనాడుకు చెందిన సెంట్రల్ ఇన్‌కమ్‌టాక్స్ అధికారులు సీఐఎస్‌ఎఫ్ జవాన్లతో ఏలూరు నగరానికి వచ్చి పత్తేబాదలో ఉన్న ఉండవల్లి అపార్టుమెంటులోని వ్యాపారవేత్త నూకల రామకృష్ణ ఇంట్లో సోదాలు చేపట్టారు. ఆయనకు సంబంధించి ఏలూరు ఆర్ఆర్ పేటలో ఉన్న సేఫ్‌మ్యాక్ సొసైటీ లిమిటెడ్ బ్యాంకులో కూడా సోదాలను గురువారం నిర్వహించారు. ఐదు కార్లలో వచ్చిన అధికారులు తమ వాహనాలపై స్టిక్కర్లు అంటించుకుని వచ్చి సోదాలు నిర్వహిస్తున్నారు. ఏలూరు తూర్పు వీధిలో ఉన్న ఆయన పాత ఇంట్లో కూడా తనిఖీలు చేస్తున్నారు. ఈ సోదాలు శుక్రవారం కూడా కొనసాగిస్తారని తెలుస్తోంది. ఈ తనిఖీల నేపథ్య ంలో రామకృష్ణ అధికారులకు అందుబాటులో లేకుండా వేరే ప్రాంతంలో ఉన్నారు. ఆయన కార్యాలయంలో పనిచేసే అకౌంటెంట్లు, గుమస్తాలు కూడా ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్ళినట్లు తెలుస్తోంది.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు



మొగల్తూరులో తనిఖీలు నిర్వహిస్తున్న లీగల్ మెట్రాలజీ ఏసీ సాయిరాం

మొగల్తూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): లీగల్ మెట్రాలజీ శాఖ రాష్ట్రవ్యాప్త తనిఖీల్లో భాగంగా జిల్లాలోని పలు పెట్రోల్ బంకుల్లో ఏకకాలంలో అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఏలూరు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ బోణం సాయిరాం ఆధ్వర్యంలో 7 బృందాలు ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని ఆచంట, నరసాపురం, పాలకొల్లు, మొగల్తూరు తదితర ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల్లో తనిఖీలు నిర్వహించి ఒక కేసు నమోదు చేసినట్టు సాయిరాం తెలిపారు. ఈ తనిఖీల్లో తాడేపల్లిగూడెం ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, అమలాపురం ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పెట్రోల్ అందించాలి

ఉండి: వినియోగదారులకు ఖచ్చితమైన తూకంతో నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌లను అందించాలని కోనసీమ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ కె.రాజేష్ సూచించారు. గురువారం ఎన్‌ఆర్‌పిఅగ్రహారంలో సాయి పెట్రోల బంక్‌ను తనిఖీ చేశారు. రాజేష్ మాట్లాడుతూ పెట్రోల్ బంక్‌ల సాధారణ తనీఖలలో భాగంగా జంబ్లింగ్ విధానాన్ని అనుసరించి కోనసీమ జిల్లాకు చెందిన తాను భీమవరం, ఉండి, ఆకివీడు ప్రాంతాలలోని పెట్రోల్ బంకులను తనీఖీ చేయడం జరిగిందన్నారు. బంకుల్లో ఉచిత సౌకర్యాలైన గాలిపంపు, మంచినీరు, టాయిలెట్స్ తనిఖీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తూనికలు కొలతలు శాఖ భీమవరం ఇన్‌స్పెక్టర్ టి.రాంబాబు, సాయి పెట్రోల్‌బంక్ మేనేజరు కాశేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రిజిస్ట్రార్ తనిఖీ

భీమవరం క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కొన్ని రోజులుగా భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన వివాదంపై రెండోసారి జిల్లా రిజిస్ట్రార్ ఎల్.వెంకటేశ్వర్లు గురువారం విచారణ జరిపారు. సబ్ రిజిస్ట్రార్ డబ్బులు డిమాండ్ చేశారని, అలాగే దస్తావేజు లేఖర్లు సబ్ రిజిస్ట్రార్‌ల మధ్య ఘర్షణ పలు విషయాలుపై ఆయన విచారణ జరిపారు. దస్తావేజు లేఖర్లను పిలిచి వివరాలు తెలుసుకున్నారు. అలాగే కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులతో కూడా మాట్లాడి వివరాలు సేకరించారు. దీనిపై నివేదిక తయారు చేస్తానని ఆయన తెలిపారు.

నేడు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

ఏలూరుసిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఈనెల 8వ తేదీ ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు జడ్పీ సిఈఓ కెఎస్ఎస్ సుబ్బారావు తెలిపారు. జిల్లా అధికారులు సంబంధిత నివేదికలతో ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

క్రైమ్ కార్నర్

వీడని చోరీల మిస్టరీ

సీసీ కెమెరాల్లో వ్యక్తి ఆనవాళ్లు



నరసాపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల పట్టణంలో వరుసగా జరిగిన చోరీల మిస్టరీ ఇంకా వీడలేదు. గత నెలలో మచిలీపట్నంలో పని చేస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో ఇంట్లోను, పట్టణంలోని 18వ వార్డు, మొగల్తూరు రోడ్‌లోని బజాజ్ షోరూం సమీపంలోని మరో ఇంట్లో చోరీ జరిగింది. వీటికి ముందు పట్టణంలో మరో రెండు ఇళ్ళల్లో కూడా జరిగింది. ఇవన్నీ తాళాలు వేసిన నివాసాలే. అయితే వరుసగా ఈ చోరీలకు పాల్పడుతున్నది ఎవరిన్నది పోలీసులకు పెద్ద ఛాలెంజ్‌గా మారింది. ఈ క్రమంలో చిన్న ఆచూకి చిక్కింది. ఇటీవల జరిగిన చోరీలో ఓ ఇంట్లోని సీసీ కెమెరాల్లో ఓ వ్యక్తి ఆనవాళ్లు రికార్డు అయ్యాయి. దాని ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే ఇంత వరకు ఆ వ్యక్తి చిక్కలేదు. మరోవైపు తూర్పుతాళ్ల గ్రామంలోని జ్యూయలరీ షాపులో జరిగిన చోరీ మిస్టరీ కూడా వీడలేదు. ఇంత వరకు ఈకేసులో రికవరీ లేదు. వరుసగా తాళం వేసిన ఇళ్ళల్లోనే చోరీలు జరుగుతుండటంతో ప్రజలు భయపడుతున్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

20 బాటిల్స్ స్వాధీనం

పెనుమంట్ర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెనుమంట్ర మండలం ఎస్. ఇల్లింద్రపర్రు గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న గుబ్బల వెంకట సత్యనారాయణను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 20 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నామని తణుకు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. మణికంఠ రెడ్డి తెలిపారు. కొత్త మద్యం పాలసీ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 8 మంది బెల్ట్‌షాపు నిర్వాహకులపై కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి 139 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడుల్లో ఒకరి అరెస్టు

భీమవరం క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్‌వీ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులు వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో గురువారం నాడు దాడులు చేశారు. ఈ దాడుల్లో చింతపల్లి గణపతి అనే బెల్ట్ షాపు నిర్వాహకుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 19 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆటో ఢీ: ముగ్గురికి గాయాలు

ఒంగోలు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా నాగుల దేవరపాడు గ్రామానికి చెందిన పల్లి సాంబశివరావు గురువారం విధి నిర్వహణలో భాగంగా కారులో ఒంగోలుకు వెళ్తున్నారు. మార్గంమధ్యలో ఒంగోలుకు సమీపంలో భగవాన్‌రాజుపాలెం ఫ్లైవోవర్ వద్ద కారుదిగి రోడ్డు మార్జిన్‌లో మూత్రవిసర్జనకు వెళ్లి వస్తున్న క్రమంలో అదే రహదారిలో ఒంగోలు వైపు వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాంబశివరావు తలకు గాయం కాగా, ఆటో డ్రైవర్, ఆటోలో ఉన్న మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ముగ్గురినీ చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తర్వాత సాంబశివరావుకు మెరుగైన వైద్యానికి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

భూమి రాయించుకున్న వ్యక్తిపై కేసు

ముదినేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దువాక గ్రామానికి చెందిన పెద్దింటి రామతులసీ అనే మహిళను నమ్మించి ఆమె భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న కలిదిండి మండలం పోతుమర్రుకు చెందిన పుట్టి రాంబాబుపై గురువారం కేసు నమోదైంది. పోలీసు కథనం ప్రకారం రా మతులసీ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ వృద్ధా ప్యంలో ఉన్న తన తల్లిని కూడా పోషిస్తున్నది. ఆ సమయంలో మాయమాటలు చెప్పి, నీవు క్యాన్సర్ తో చనిపోతే నీ తల్లిని నేను పోషిస్తా, నీకు వ్యాధి తగ్గితే తిరిగి నీ పొలం రిజిస్ట్రేషన్ చేసేస్తా అంటూ రామతులసీని నమ్మించి 76 సెంట్ల భూమిని 2023లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం మెరుగుపడటంతో రాంబాబు తిరి గి పొలం రిజిస్ట్రేషన్ చేసేందుకు నిరాకరిస్తుం డటంతో తనకు జరిగిన మోసంపై ఆమె ముదినే పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై గురు వారం ఆమెకు మద్దతుగా పలువురు పాస్టర్లు పోలీస్ స్టేషన్‌కు వచ్చి రామతులసీకి న్యాయం చేయాలని డిమాండ్ చేసి సీఐ రవికుమార్‌తో చర్చించారు. దీనిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరభద్రరావు తెలిపారు.

మినీ వ్యాన్‌ను ఢీకొన్న ఆటో

15 మందికి గాయాలు



తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పెదతాడేపల్లి జాతీయ రహదారిపై మినీ వ్యాన్‌ను ఆటో ఢీకొట్టిన ఘటనలో 15 మందికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దువ్వకు చెందిన ఆటో డ్రైవర్ గంగరాజు భీమడోలుకు చెందిన 15 మంది కూలీలను ఆటోలో ఎక్కించుకుని దువ్వ రొయ్యల ఫ్యాక్టరీకి తీసుకు వెళ్తుండగా ఆటో డ్రైవర్‌కు కునుకు వస్తుండటం గమనించిన కూలీలు ఆటోను రోడ్డుపక్కన ఆపాలని సూచించారు. అయినా వినకుండా ముందుకు సాగడంతో పెదతాడేపల్లి వద్దకు వచ్చే సరికి ఆగిఉన్న మినీ లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో కూలీలకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని బయటకు తీసి స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని రూరల్ ఎస్సై ప్రసాద్ పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

టైర్ పంక్చరై ఆటో బోల్తా

ఆరుగురికి గాయాలు

నూజివీడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం సిద్ధార్థనగర్ వద్ద వ్యవసాయ కూలీలతో వెళుతున్న ఆటో టైర్ పంక్చరై ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో ఆరుగురు మహిళలకు గాయాలయ్యాయి. నూజివీడు మండలం అన్నవరం నుంచి రెడ్డిగూడెం మండలం నాగులూరుకి వ్యవసాయ పనుల కోసం తొమ్మిది మంది మహిళలు ఆటోలో బయల్దేరారు. ఈ ఆటో సిద్ధార్థనగర్ గ్రామ సమీపంలో టైర్ పంక్చరై తిరగబడింది. ఈ ఘనటలో నాగమల్లేశ్వరి, రమణమ్మ, రజినీ, రాజ్యలక్ష్మి, శ్రీదేవి, వెంకటరత్నం గాయాలపాలయ్యారు. వీరిని వెంటనే నూజివీడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో నాగమల్లీశ్వరి, వెంకటరత్నమ్మను మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మంత్రి కొలుసు పార్థసారథి నూజివీడు, విజయవాడ ఆసుపత్రి వైద్య అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు.

అవినీతి ఆరోపణలు వస్తే సహించేది లేదు

కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యోగులందరూ ప్రజలకు మెరుగైన సర్వీసులను అందించడంలో ముందుండాలి. అవినీతి ఆరోపణలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. గురువారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లోకి ప్రవేశించిన వెంటనే రెవెన్యూ విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు సెక్షన్లలోని ఫైల్స్‌ను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత ఉద్యోగులపై ప్రశ్నల వర్షం కురిపించారు. రోజుకు ఎన్ని గ్రీవెన్స్ వస్తున్నాయి, వాటికి సరైన సమయంలో సమాధానాలు ఇస్తున్నారా, వ్యక్తిగత రిజిస్టర్లు ఎందుకు మెయింటెన్ చేయట్లేదు, వివిధ బిల్లుల చెల్లింపులు సకాలంలో చేస్తున్నారా, రికార్డులను పక్కాగా ఉన్నాయా తదితర ప్రశ్నలను సంధించారు. తన ఆదేశాలు హెచ్చరికగా, సూచనలుగా భావిస్తారో లేదో మీ ఇష్టం, ఇక నుంచి ఏ విషయమైనా నా దృష్టికి వస్తే పక్కాగా చర్యలు ఉంటాయని గట్టిగా హెచ్చరించారు.

భాషాభిమానం ఉండాలి

ఆచార్య శాంతిశ్రీ ధూళిపూడి

దివాన్‌చెరువు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో భాషాభిమానం ఎక్కువగా ఉన్నవారిలో తమిళనాడు మొదటి స్థానంలో ఉందని, తెలుగు వారు అటువంటి భాషాభిమానాన్ని అలవాటు చేసుకోవాలని న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య శాంతిశ్రీ ధూళిపూడి అన్నారు. నన్నయ వర్శిటీలో రెండురోజుల పాటు నిర్వహిస్తున్న సాంస్కృతిక వైభవం-సదస్సును గురువారం ప్రారంభించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య శాంతిశ్రీ మాట్లాడుతూ తెలుగు వైభవాన్ని భారత దేశంతో పాటు ప్రపంచ దేశాలకు చాటిచెప్పాలన్నారు. కందుకూరి, గురజాడ వంటి మహనీయులు మన సంస్కృతిలో భాగమని, ఇటువంటి మహనీయులను స్మరించుకుంటూ భావితరాలకు మన సంస్కృతిని అందించాలని సూచించారు.

బుట్టాయగూడెం సీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ


సీహెచ్‌సీలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్

బుట్టాయగూడెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రంపై వచ్చిన ఆరోపణలపై పశ్చిమ గోదావరి జిల్లా వైద్య శాఖ అధికారులు విచారణ నిర్వహించారని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్‌కుమార్ తెలిపారు. సీహెచ్‌సీని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యుడు సెలవు పెట్టకుండా విధులకు డుమ్మా కొట్టినట్లు గుర్తించారు. సీహెచ్‌సీలో కొందరు వైద్యులు, సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు, ఆరోపణలు వచ్చాయన్నారు. మద్యం సేవించి విధులకు హాజరు కావడం, పెషేంట్ల వద్ద నుంచి డబ్బులు డిమాండ్ చేయడం, విధులకు డూమ్మా కొట్టడం, విధుల్లో పట్ల అలసత్వంపై విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యులతో జరిగిన సమీక్షలో పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో అన్ని ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్యులు, సిబ్బంది కొరతలేదని, ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందేలా చూస్తున్నట్లు తెలిపారు. చిత్తశుద్ధితో ప్రజలకు సేవలు అందించాలని వైద్యులకు, సిబ్బందికి సూచించారు.

శిశు మరణాలు నివారించాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి మధుబాబు

చింతలపూడి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శిశు మరణాలు అరికట్టాలని, బాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జూనియర్ సివిల్ న్యాయాధికారి సి.మధుబాబు అన్నారు. గర్భస్థ శిశు దినోత్సవ సందర్భంగా లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రిలో గురువారం జరిగిన సదస్సులో మాట్లాడారు. చిన్న పిల్లల వైద్యంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎ.నారాయణరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, ఐసీడీఎస్ పీవో మాధవి, న్యాయవాదులు డేవిడ్‌రాజు, ఎస్‌కె.ఉమర్ ఫరూఖ్, దుర్గాభవాని, అక్బర్ ఆలీ, అశోక్‌బాబు పాల్గొన్నారు.

● ఏలూరు క్రైం: ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో నవ జాత శిశువులకు అందుతున్న వైద్య సేవలు, ఆహార అంశాలపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.రత్న ప్రసాద్ అడిగి తెలుసుకున్నారు. గర్భస్థ శిశు దినోత్సవం సందర్భంగా ఏలూరు ప్రభుత్వాసుపత్రిని జడ్జి రత్న ప్రసాద్ సందర్శించారు. పసిబిడ్డల ఆరోగ్యంపై అత్యంత జాగ్రత్త వహించాలని సూచించారు. బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పీఏ ఆర్‌ఎస్ శ్రీనివాసరావు, చిన్న పిల్లల వైద్య నిపుణులు దీపక్, ఎన్‌జీవో అజయ్‌బాబు, రామారావు పాల్గొన్నారు.

దంతాల సంరక్షణతో వ్యాధులు దూరం

పెదవేగి: దంతాలు ఆరోగ్యంగా ఉంటే సగం వ్యాధులకు దూరమైనట్లేనని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల ప్రజాదంత ఆరోగ్య వైద్య విభాగం హెచ్‌ఓడీ పావన సంధ్య అన్నారు. జాతీయ టూత్ బ్రష్ దినోత్సవాన్ని పురస్కరించుకుని దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల ఆధ్వర్యంలో పినకడిమి పాఠశాలలో గురువారం అవగాహన శిబిరం కల్పించారు. పావన సంధ్య మాట్లాడుతూ వ్యక్తి అనారోగ్యానికి ప్రధాన కారణంగా దంత సంరక్షణ సక్రమంగా లేకపోవడమేనన్నారు. చాలామంది దంత సంరక్షణపై నిర్లక్ష్యంగా ఉంటారని, ఇది సరైన విధానం కాదన్నారు. దంతదావనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దంతవైద్య కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.స్లీవరాజు, అధ్యాపకులు, దంతవైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిరోధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

భీమడోలు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు నిరోధించాలంటే తల్లి దండ్రుల పాత్ర చాలా కీలకమని చైల్డ్ రైట్స్ ఫౌండేషన్ క్రాఫ్ట్ ఎడ్యుకేషన్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. గుండుగొలనులో బాల్య వివాహాల నివారణపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల నియంత్రణకు పాఠశాలలో గురువులు బాధ్యత తీసుకోవాలన్నారు. చిన్న వయస్సులో బాల్య వివాహాలు చేసుకుని వారి జీవితాలు పాడవుతాయన్నారు. బాల్య వివాహాలు జరిగే ముందు రోజు సమాచారం ఇస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ వివాహాలను నిలుపుదల చేస్తుందన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారం 18ఏళ్లలోపు బాలికలకు వివాహం చేస్తే పెద్దలకు శిక్షపడే అవకాశం ఉందన్నారు. గుండుగొలను ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ కవిత, రామకృష్ణ, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు, చైల్డ్ రైట్స్ క్రాఫ్ట్ సమన్వయకర్త వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

బస్‌లో ఫుట్‌బోర్డ్ ప్రయాణం ప్రమాదకరం

నగరంలో మహిళా పోలీసు బృందాల గస్తీ


బస్సులో విద్యార్థినులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ కాంతిప్రియ

ఏలూరు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రయాణించే బస్సుల్లో ఫుట్‌బోర్డ్‌పై ప్రయాణాలు చేస్తున్నారని, ఇది ఎంతో ప్రమాదకరమని ఏలూరు మహిళాపోలీస్ స్టేషన్ ఎస్‌ఐ వల్లూరి కాంతిప్రియ అన్నారు. నగరంలో మహిళా పోలీసు బృందాలతో గురువారం రాత్రి గస్తీ నిర్వహించారు. పార్కులో జంటలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నగరంలో ఈవ్‌టీజింగ్ జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నేరుగా ప్రైవేటు కాలేజీ బస్సుల్లో విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే వెంటనే 112కు సమాచారం అందించాలని 10 నిముషాల వ్యవధిలోనే చేరుకుని కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

'అభయ' మహిళా భద్రత

సమాజంలో నేరగాళ్ళను అదుపు చేయాలనే ముఖ్య ఉద్దేశ్యంతో అభయ మహిళా భద్రత అనే బృందాలను ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారని టూటౌన్ ఎస్‌ఐ నాగకల్యాణి అన్నారు. సుబ్బదేవి హైస్కూలులో అభయ మహిళా భద్రత అంశంపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఆపద సమయంలో డయల్ 112కు ఫోన్‌చేసి పది నిముషాలలోపే పోలీస్ సహాయాన్ని పొందవచ్చన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయన్నారు. బాల్య వివాహాలు చేయడానికి ప్రయత్నిస్తే 1098కు సమాచారం అందించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి డిజిటల్ లావాదేవీలు ఎక్కువగా జరుపుతున్నారని అయితే సైబర్ నేరగాళ్ళ పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930కు సమాచారం అందించాలని సూచించారు.

16 మద్యం సీసాలు స్వాధీనం

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వైవిఎన్ఎస్ ఫణికుమార్, హెడ్‌కానిస్టేబుల్ కిశోర్, సిబ్బంది దాడి అక్రమంగా కలిగిఉన్న మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. పెదపాడు మండలం కలపర్రులో ఒకరిని అరెస్టు చేసి 16 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

ఏలూరు రూరల్ మండలం లింగారావుగూడెంలో పేకాడుతున్నట్లు ఎస్‌ఐ సిహెచ్ దుర్గా ప్రసాద్‌కు సమాచారం అందింది. తన సిబ్బందితో దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రెండు వేల 300 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టి.నరసాపురంలో ఐదుగురు..

టి.నరసాపురం: పేకాట స్థావరంపై దాడిచేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్సై వి.జయకుమార్ గురువారం తెలిపారు. మండల కేంద్రమైన టి.నరసాపురం సమీపంలో పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారంతో దాడిచేసి ఐదుగురు వ్యక్తులను అరెస్ట్‌చేసి వారివద్ద రూ.5,520 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఒక్కటే దుకాణం!

చింతలపూడి రైతుబజార్ నిర్వహణలో నిర్లక్ష్యం


రైతుబజార్‌లో ఖాళీగా దుకాణాల ప్లాట్‌ఫామ్స్, ఆవరణలో వాహనాలు, చెత్తబండి

చింతలపూడి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాత్మాగాంధీ రైతుబజార్‌లో ఒక్కటే కూరగాయల దుకాణం ఉంది. వైసీపీ ప్రభుత్వంలో రైతుబజార్లను పట్టించుకున్న దాఖలాలు లేవు. 2016లో చింతలపూడి పాత బస్టాండ్ వద్ద మార్కెట్ కమిటీ సుమారు రూ.8 లక్షలతో రైతుబజార్ ఏర్పాటు చేశారు. కొంతకాలం 18 దుకాణాలు నడిచాయి. ప్రభుత్వం మారిన తర్వాత రైతుబజార్‌లో ఒక్కొక్క దుకాణం ఎత్తివేశారు. ప్రస్తుతం ఒక్క దుకాణం మాత్రమే ఉంది. రైతుబజార్ ఆవరణలో పంచాయతీ చెత్తబండ్లు, వాటర్ ట్యాంకు, కారు పార్క్ చేస్తున్నారు. కూరగాయల దుకాణాల ప్లాట్‌ఫారాలన్నీ ఖాళీగా ఉన్నాయి. మార్కెట్ కమిటీ అధికారులు వీటి ఆలనాపాలనా పట్టించుకోవడంలేదు.

లక్షలు వెచ్చించి రైతుబజార్ ఏర్పాటు చేసినా నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం శాపంగా మారింది. పంచాయతీ పట్టణ స్థాయికి పెరగడంతో రెండు మార్కెట్‌లు అవసరం. ఉన్న రైతుబజారులో అయినా మార్కెట్ కమిటీ అధికారులు దుకాణాల నిర్వహణకు చర్యలు చేపడితే పట్టణ ప్రజలు, రైతులకు ప్రయోజకరంగా ఉంటుంది.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి : టి.బాబు



మునిసిపల్ అధికారులు, మార్కెట్ కమిటీ అధికారుల నిర్లక్ష్యం వలనే రైతుబజారు నిరుపయోగమైంది. రోడ్డుపక్కన దుకాణాల వలన ఆక్రమణలు పెరిగాయి. ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రైతులను ప్రోత్సహించి రైతుబజారులో దుకాణాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలి. మునిసిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.



పెదపాడు, లింగపాలెం, కొయ్యలగూడెంలో క్యాన్సర్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

క్యాన్సర్ నివారణ సాధ్యమే

వైద్య ఆరోగ్య శాఖ అవగాహన ర్యాలీ

ఏలూరు టూటౌన్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ రహిత సమాజ స్థాపనలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో గురువారం క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీ మహేశ్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారణ సాధ్యమన్నారు. క్యాన్సర్ గురించి భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఆరోగ్యశ్రీ, సీఎంఆర్‌ఎఫ్‌ల ద్వారా పేదలకు ఉచిత చికిత్స అందుతుందన్నారు. ప్రతీ నెల క్యాన్సర్ నిర్ధారణ ఉచిత వైద్య శిబిరాలు కొనసాగిస్తామన్నారు. విజయవాడ నుంచి వచ్చిన క్యాన్సర్ వైద్యనిపుణుల బృందం మహిళలకు రొమ్ముక్యాన్సర్, గర్భాదయ ముఖద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో సుమారు 100మంది మహిళలు పాల్గొన్నారు.

ఆశ్రంలో..

ఆశ్రం ఆసుపత్రిలో శ్రేయస్సు పేరిట పూర్తిస్థాయి వైద్య సేవలందిస్తున్నామని సీఈవో డాక్టర్ హనుమంతరావు తెలిపారు. ఈ నెలలో క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. క్యాన్సర్ వ్యాధి నిశబ్దంగా ప్రబలుతుందని, ముందుగా నిర్ధారణ పరీక్షలతో గుర్తించవచ్చన్నారు. వైద్యనిపుణులు డాక్టర్ శైలజ, డాక్టర్ సింధూ, డాక్టర్ కన్మని, సీవోవో రాజరాజన్, పాల్గొన్నారు.

● పెదపాడు: ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ అనంతపాల్ తెలిపారు. పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్‌ను నయం చేసే వైద్యం అందుబాటులో ఉందన్నారు.ప్రతి ఒక్కరూ ధైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చునన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

● లింగపాలెం: వైద్యుల సూచనలతో సరైన మందులు వాడితే క్యాన్సర్ నివారించవచ్చని డాక్టర్ కృష్ణకిశోర్ అన్నారు. కె.గోకవరం, లింగపాలెం, ధర్మాజీగూడెం పీహెచ్‌సీల పరిధిలో సర్వే నిర్వహించారు. 18 ఏళ్ల వయసు నిండిన ప్రతి ఒక్కరికి క్యాన్సర్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. రొమ్ముక్యాన్సర్, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌లతో పాటు షుగర్, రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. గ్రామాలలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. వైద్యులు సంధ్యారాణి, యానీప్రీతి, ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

● నిడమర్రు: క్యాన్సర్‌పై అవగాహన కలిగి ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా జీవించాలని పెదనిండ్రకొలను పీహెచ్‌సీ డాక్టర్ పి.తేజశ్రీ అన్నారు. ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దనే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తామన్నారు. అవగాహన ద్వారా నే కాన్సర్ బారిన పడకుండా నివారించవచ్చన్నారు. పి.కృపావరం, ఎస్.ప్రియదర్శిని, జె.మరియమ్మ, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ పి.సత్యనారాయణ అన్నారు. గ్రామంలో ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తిస్తే నివారణ సులభం అన్నారు. డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖ ప్రతిష్ఠ పెంచాలి

ఏలూరుసిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన పాలన అందించి రెవెన్యూ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచేందుకు ప్రతి అధికారి, సిబ్బంది కృషిచేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్‌లో జేసీ పి.ధాత్రిరెడ్డితో కలిసి రెవెన్యూ అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, భూసేకరణ ధాన్యం కొనుగోలు, రీసర్వే, ఓటర్ల జాబితా సవరణ, గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల ఓటర్ల జాబితా, నీటి సంఘాల ఎన్నికలు, కోర్టు కేసులు తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. సమావేశంలో జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో వి విశ్వేశ్వరరావు ఇతన రెవెన్యూ డివిజినల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

ఏలూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా మలేరియా అధికారి ప్రసాద్ సూచించారు. ఆముదాల అప్పలస్వామి కాలనీ అర్బన్ పీహెచ్‌సీలో గర్భిణులు చేపట్టాల్సిన జాగ్రత్తలపై గురువారం ఆయన సూచనలు ఇచ్చారు. వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌షాపులో విజిలెన్స్ తనిఖీ

ఏలూరు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా విజిలెన్సు ఎస్పీ వి.శ్రీరాంబాబుకు అందిన సమాచారంతో విజిలెన్స్ తహసీల్దార్ వి కన్యాకుమారి, ఆర్‌ఎస్‌డీటీ నరపాము నాగరాజు, పౌరసరఫరాల అధికారులు లింగపాలెం మండలం మఠంగూడెం రేషన్‌షాపు (051009) తనిఖీ చేశారు. రేషన్ బియ్యం, పంచదార, పప్పుల నిల్వలలో వ్యత్యాసం ఉండడాన్ని గుర్తించారు. దీంతో రేషన్ షాపు డీలర్‌పై నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేశారు.

తాటాకిల్లు దగ్ధం

జీలుగుమిల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక చంద్రమ్మకాలనీలో గురువారం సాయంత్రం కొర్స రమేష్ తాటాకింట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు ఇంటికి నిప్పు అంటుకుంది. స్థానికులు మంటల్ని అదుపు చేసే ప్రయత్నం చేశారు. అప్పటికే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. సమీప ఇళ్లకు ప్రమాదం లేకుండా అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటల్ని అదుపు చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి : బడేటి చంటి


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఏ సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో చోడే వెంకటరత్నం, రెడ్డి నాగరాజు, తిరుపతి, జి.శ్రీనివాస్, వీ.శ్రీనివాస్, వీ.బాలాజీ, పాల్గొన్నారు.

కూటమి గెలుపులో బ్రహ్మణుల పాత్ర

కూటమి ప్రభుత్వం విజయం సాధించడంలో బ్రహ్మణుల పాత్ర ఎంతో ఉందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఆర్ఆర్.పేట మార్కెండేయ వేద పాఠశాలలో శ్రీశక్తి బ్రాహ్మణ మహిళా సంఘం వార్షికోత్సవంలో గురువారం ఆయన పాల్గొన్నారు. బ్రాహ్మణులు క్రమశిక్షణకు మారుపేరు అన్నారు. సామాజిక సేవ చేస్తున్న శ్రీశక్తి బ్రహ్మణసేవా సంఘం నేతలను కొనియాడారు. పేదబ్రహ్మణులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు కె.తాయారు, కార్యదర్శి అనురాధ, కోశాధికారి వీ.శ్రీరమణి, డాక్టర్ వి.సుబ్బలక్ష్మి, రాష్ట్ర బ్రాహ్మణసేవా సంఘం సమాఖ్య అధ్యక్షుడు ఎస్.దుర్గాప్రసాద్, ఈదర వెంకటరమణ, వీవీ.హనుమంతరావు, ఎంవీఎస్.శర్మ, బీ.అయ్యంగార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సమస్యలపై సీపీఎం ప్రజాపోరు


ప్రజాపోరు పోస్టర్లు ఆవిష్కరించిన మంతెన సీతారాం

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 14 వరకు ప్రజాపోరు ప్రచారోద్యమం జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రజాపోరు పోస్టర్స్ ఆవిష్కరించారు. ప్రజా సమస్యలపై పోరాడతామని, ప్రజా పోరులో సమస్యలు తెలుసుకుంటామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక చర్యలను ఖండిస్తూ ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా పెట్రోలు, డీజిల్, రిటైల్ ధరలు తగ్గించాలన్నారు. నిరుద్యోగం, మౌలిక సేవల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. సీపీఎం నాయకులు డీఎన్‌వీడీ.ప్రసాద్, ఆర్.లింగరాజు, పి.కిషోర్, ఎం.నాగమణి, బి.రాజులు తెలిపారు. ఏలూరు నగరంలోని 50 డివిజన్లలోను ప్రజాపోరు యాత్రను శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పళ్ళెం కిషోర్ తెలిపారు.

23న మునిసిపల్ వర్కర్స్ సమావేశం

ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) సమావేశాన్ని ఈనెల 23న జంగారెడ్డిగూడెంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే తెలిపారు. గురువారం సీపీఐ కార్యాలయం వద్ద బ్రోచర్లను ఆవిష్కరించారు. మునిసిపల్ వర్కర్ల సమస్యలపై చర్చించి తీర్మానాలు చేస్తామని తెలిపారు. యూనియన్ నాయకులు కంకిపాటి బుచ్చిబాబు, తొర్లపాటి బాబు, పుల్లారావు, వసంతరావు, పి.అప్పలరాజు, వై.దుర్గారావు, బాలు, శ్రీనివాసరావు, రవీంద్ర భాస్కరరావు, మల్లేశ్వరరావు, వై.ప్రసాద్, సురేష్ తదితరులు ఉన్నారు.

అసైన్డ్ భూములు పేదలకు ఇవ్వాలి

దెందులూరు: పేదలు, దళితులకు అసైన్డ్ సీలింగ్ భూములను గ్రామకంఠాలను పంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ కార్మిక సంఘం కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. దోసపాడు, పోతునూరు పరిధిలో పేదల భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ సుమతికి వినతిపత్రం అందజేశారు.

రెండోరోజు వీవోఏల నిరసన

చింతలపూడి: పెండింగ్ జీతాలు విడుదల చేయాలని కోరుతూ వీవోఏలు రెండో రోజు గురువారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపాలని కోరారు.

14 నుంచి డీఎస్సీ ఉచిత శిక్షణ

ఏలూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏలూరు బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీకి ఉచిత శిక్షణ తరగతులు ఈనెల 14 నుంచి ప్రారంభిస్తున్నట్లు బీసీ వెల్ఫేర్ అధికారి ఆర్.వి నాగరాణి గురువారం తెలిపారు. టెట్‌లో అర్హత సాధించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఈనెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, టీటీసీ లేదా డీఎడ్, కుల ధ్రువీకరణ, ఆదాయ, ఆధార్ జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు అందజేయాలన్నారు. ఎంపి కైన అభ్యర్థులకు 60రోజుల పాటు శిక్షణ, స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. వివరాలకు 7569184335 నెంబర్లో సంప్రదించాలన్నారు.

10న ఎంపిక పరీక్ష

జిల్లాలో ప్రతిభావంతులైన పేద ఎస్సీ, ఎస్టీ, విద్యార్థులకు సాంఘిక గిరిజన, సంక్షేమశాఖల ఆధ్వర్యంలో డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి జయప్రకాష్ తెలిపారు. నిష్ణాతులైన అధ్యాపకులు శిక్షణ ఇస్తారన్నారు. అభ్యర్థుల ఎంపికకు ఈనెల 10న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. టెట్ ఉత్తీర్ణులై ఉంటే వారికి స్క్రీనింగ్ టెస్ట్ రాయటానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వెబ్‌సైట్‌లో తమ హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ చేసుకుని 10న పరీక్షా కేంద్రానికి అరగంట ముందుగా కేటాయించిన కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే సమయంలో పాస్‌పోర్టు సైజు ఫొటో, ఆధార్ లేదా, డ్రైవింగ్ లైసెన్స్ ఏదైనా ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపుకార్డు తీసుకుని హాజరుకావాలని తెలిపారు.

డీఎల్‌ఎడ్ పరీక్షలు

ఏలూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గురువారం జరిగిన డీఎల్‌ఎడ్ రెండో సెమిస్టర్ పరీక్షకు 46మంది, ఫస్టియర్ సప్లిమెంటరీ పరీక్షకు ఐదుగురు విద్యార్థులు హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.


కిట్ అందిస్తున్న లయన్స్ ప్రతినిధులు

లయన్స్ సేవా మహోత్సవం

కామవరపుకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సేవా మహోత్సవం కార్యక్రమాన్ని గురువారం గుంటుపల్లి పంచాయతీ జీలకర్రగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి ఆర్ఆర్.రత్నకుమారి రంగరాజు ఆధ్వర్యంలో పాఠశాలకు ప్రింటర్, బీరువా, స్పోర్ట్స్ కిట్‌లు, స్టావ్‌లు అందజేశారు. దివ్యాంగులకు వీల్‌చైర్స్, గర్భిణులకు పోషక విలువల ఆహార కిట్‌లు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు, వైస్ గవర్నర్ పాపారావు నాయుడు, సుబ్బారావు, జీలకర్రగూడెం లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు ఎస్ఆర్ఆర్ యర్రంరాజు, సీహెచ్.మోహన్‌రావు, గోలి చంద్రశేఖర్‌రెడ్డి, అబ్బాయి, చెలికాని కిరణ్, హనుమంతరావు, మద్దిపాటి నాగేశ్వరరావు, మద్దుకూరి శ్రీహరి, పండు, కామేశ్వరరావు, బాలవర్ధిరాజు, పాటిమళ్ళ సుబ్బారావు, మాధవరెడ్డి, శర్మ, వర్మ, మహేశ్వరి, పూర్ణశ్రీ పాల్గొన్నారు.

ఐఎంఎఫ్‌ఎల్ డిపోలో వస్తువుల వేలం

ఏలూరు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏలూరులో ఏపీఎస్‌బీసీఎల్, ఐఎంఎఫ్ఎల్ డిపోలో కొన్ని వస్తువులను ఈనెల 15న బహిరంగ వేలం వేస్తున్నట్లు మేనేజర్ కె వెంకటరామిరెడ్డి గురువారం తెలిపారు. ఫ్రీజర్లు 108, ఇన్వర్ట్ విత్ బ్యాటరీ 126, క్యాష్ చెస్ట్ 110, స్కానర్లు 248, క్యాష్ 120 బహిరంగ వేలం వేస్తామన్నారు. వివరాలకు 8008123152, 9550796439 సెంబర్లలో సంప్రదించాలన్నారు.

పాఠశాల విద్యార్థిని తీసుకెళ్లేందుకు విఫలయత్నం

జంగారెడ్డిగూడెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థిని తీసుకెళ్లేందుకు గుర్తు తెలియని వ్యక్తి విఫలయత్నం చేశాడు. విద్యార్థి తండ్రి శ్రీనివాస్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం మధ్యాహ్నం విద్యార్థిని భోజనానికి తీసుకువెళతానని విద్యార్థిని పిలిపించాడు. విద్యార్థి తండ్రి అప్పటికే భోజనం క్యారియర్ తీసుకురావడంతో సిబ్బంది వెళ్లారు. దీనితో అతడు మెల్లగా జారుకున్నాడు. ఎస్సై ఎస్.కె.జబీర్ పాఠశాల సీసీ కెమెరాలు పరిశీలించారు.

విద్యార్థులు విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తి కలిగి ఉండాలి

టి.నరసాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తి కలిగి ఉండాలని అప్పలరాజుగూడెం గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ డి.ఎస్.వి శంకరరావు అన్నారు. ప్రైవేటు పాఠశాలలో గురువారం శాస్త్రవేత్తలు సీవీ.రామన్, మేడమ్ మేరీ క్యూరీ జయంతి నిర్వహించారు. శంకరరావు మాట్లాడుతూ సమాజానికి మేలు చేసే వస్తువులు, విషయాలను కనుగొన్న అద్భుత శాస్త్రవేత్తలు సీవీ.రామన్, మేడం క్యూరీ అన్నారు. అటువంటి శాస్త్రవేత్తలను ప్రతి విద్యార్థి జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు పురం శ్రీనివాస్ మాట్లాడుతూ భౌతిక, రసాయన శాస్త్రాలలో అద్భుతమైన ఆవిష్కరణలతో ప్రపంచ సౌభాగ్యానికి బాటలు వేసిన శాస్త్రవేత్తలు అన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, విజయలక్ష్మి, వరలక్ష్మి, సులోచన, ప్రియాంక, జ్యోతి, అనూష, రమ్యశ్రీ, మధులత, ప్రశాంతి, సుకన్య, నక్షత్ర, విద్యార్థులు పాల్గొన్నారు.


పోలవరంలో రైతులకు సూచనలిస్తున్న అధికారులు

సమాచార హక్కు చట్టం సామాన్యుడి ఆయుధం



లింగపాలెంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

లింగపాలెం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం సామాన్యుడి ఆయుధమని ఏవో కోటగిరి మురళీకృష్ణ అన్నారు. భోగోలులో సమాచారహక్కు చట్టంపై రైతులు, గ్రామస్తులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలలో అధికారుల నుంచి ప్రజలకు కావలసిన ఏ సమాచారమైనా ఒక దరఖాస్తుతో తెలుసుకోవచ్చన్నారు. ఏడీఏ నాగకుమార్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

● చింతలపూడి: పౌరులు తమకు కావాల్సిన సమాచారాన్ని సంబంధిత శాఖ అధికారికి దరఖాస్తు చేసి పొందవచ్చని వ్యవసాయ శాఖ ఏడీజిశైలజ అన్నారు. శివపురంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై రైతులకు, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ చట్టాన్ని పౌరులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏవో కె.మీనాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

● కామవరపుకోట: మండలంలోని తడికలపూడిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సూచనలు అనుసరించి రైతులకు, గ్రామ ప్రజలకు సమాచార హక్కు చట్టం ఉద్దేశాన్ని ఏవో సి.పవన్ కుమార్ వివరించారు. సమాచారాన్ని కోరే విధానం, చట్టంలోని ముఖ్య అంశాలు, శిక్షలు, రుసుము వివరించారు. వీఆర్వోలు మాదు లక్ష్మీనారాయణ, బి.రమేష్ పాల్గొన్నారు.

● పోలవరం: కొత్త పట్టిసీమ రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహ కల్పించారు. కేఆర్ పురం సాంకేతిక వ్యవసాయ శాఖ అధికారి బి.సోమశేఖర్ మాట్లాడుతూ ప్రతి రైతు చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏవో కె రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: సమాచార హక్కు చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కే ఆర్.పురం ఏడీఏ పీజీ.బుజ్జిబాబు అన్నారు. మండల స్థాయిలో రైతులు, గ్రామస్థాయి రైతు సేవా కేంద్రం సిబ్బంది, ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణ యజమానులకు జరిగిన అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి రైతు, ప్రతి పౌరుడు అవసరం మేరకు సమాచారం పొందడం హక్కుగా భావించాలని గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు అవసరం మేరకు సరైన పద్ధతిలో అధికారుల నుంచి సమాచారం పొందవచ్చన్నారు. ఏవో కె.లక్ష్మీకుమారి, రైతు సేవా కేంద్రం సహాయకులు పాల్గొన్నారు.

● నిడమర్రు: ప్రతి రైతు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్గిఉండాలని ఏవో ఎస్.గీతాదేవి అన్నారు. ఎనికేపల్లి రైతు సేవాకేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది జాహేజ్, హనుమంతు, జవ్వాజి బాలాజీ, కాశీ పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: సమాచారహక్కు చట్టంపై ప్రతీ ఒక్కరు అవగాహన కల్గి ఉండాలని ఏవో కె.గంగాధరం అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం పొందే విధానం, అందుకు ఎలా దరకాస్తు చేసుకోవాలనే విషయంపై చర్చించారు. దరకాస్తు చేసిన 30రోజుల్లో సమాచారం ఇవ్వకుంటే తదుపరి చేపట్టాల్సిన చర్యలు కూడా రైతులకు వివరించారు.

ఆ..చీకటి రోజులు వెంటాడుతున్నాయ్



- పెద్ద నోట్ల రద్దుకి ఎనిమిదేళ్లు
- ఉనికి కోల్పోయిన రియల్ ఎస్టేట్
- కుదేలైన నిర్మాణ రంగం
- ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం
- ఉమ్మడి జిల్లాలో తిరోగమనం

పెద్ద నోట్లను రద్దు చేస్తూ (డీమానిటైజేషన్) కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి నేటికి ఎనిమిదేళ్లు నిండాయి. రూ.1000, రూ.500 నోట్లు రద్దుతో పెద్ద ఎత్తున నల్లధనం బయటకు వస్తుందని దేశంలో ఉగ్రవాదం తగ్గుతుందని పేద మధ్య తరగతి వర్గాలకు లాభం చేకూరుతుందనే ఉద్దేశ్యంతో ప్రధాని మోదీ 2016 నవంబరు 8వ తేదీ రాత్రి తీసుకున్న నిర్ణయాన్ని దేశ ప్రజలు స్వాగతించారు. అయితే పెద్దనోట్లు రద్దుతో 2017 సంవత్సరాంతం వరకూ నగదు కొరతతో సామాన్య మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. బ్యాంకు ఖాతాలలో సొమ్ము ఉన్నప్పటికీ చేతిలో ఖర్చులకు నగదు లేక నానా అవస్థలు పడ్డారు.. ఆ రోజులు తలచుకుంటే ఇప్పటికీ అమ్మో అని అనుకుంటుంటారు..

పాలకొల్లు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ ఎనిమిదేళ్ల కాలంలో 50 వేల కోట్లు రూపాయలకు పైబడి ఆర్థిక లావాదేవీలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలపై నోట్ల రద్దు ప్రభావం తీవ్రంగానే కనిపించింది. మొత్తంగా వాణిజ్య వర్గాలపైనా ఆ ప్రభావం పడింది. పెద్ద నోట్లు రద్దుకు ముందు రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక వెలుగు వెలిగింది. జిల్లాలో ఏడాదికి వెయ్యి ఎకరాలకు తక్కువ కాకుండా లేఅవుట్లు వేసేవారు. అయితే నోట్లు రద్దు అనంతరం నగదు చలామనీపై ఆంక్షలు, ఆర్థిక లావాదేవీలపై ఐటీ కన్ను తదితర పరిణామాల నేపథ్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం నాలుగింట ఒకవంతుకు పడిపోయింది. గడిచిన ఎనిమిదేళ్లలో జిల్లాలో ఒక్క రియల్ ఎస్టేట్ రంగంలోనే రూ.20 వేల కోట్లుకు పైబడి నష్టాలు ఉంటాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే 2016కు ముందు ఇళ్ల స్థలాలు, భూముల ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడూ అదే విధంగా ఉండటం అందుకు ఉదాహరణగా చెబుతున్నారు.

కుదేలైన నిర్మాణ రంగం

ఉమ్మడి జిల్లాలో నిర్మాణ రంగం కుదేలైంది. పెద్ద నోట్లుకు రద్దుకు తోడు కరోనా, 2019లో ప్రారంభమైన జగన్ రెడ్డి దుష్పపాలన నిర్మాణ రంగాన్ని కనిష్ట స్థాయికి దించాయి. పెద్ద నోట్లుకు రద్దుకు ముందు నిర్మించిన వ్యక్తిగత భవనాలు రెండు, మూడు బెడ్ రూంల ప్లాట్లు జిల్లాలో పట్టణాలు వారీగా ఇంకా వందల సంఖ్యలో అమ్ముడు పోకుండా ఉన్నాయి. ఈ కష్టాలకు తోడు జనంలో కొనుగోలు శక్తి తగ్గడం నిర్మాణ రంగాన్ని మరింత క్షీణ దశకు తెచ్చాయి.

అన్ని రంగాల పైనా ప్రభావం

పెద్ద నోట్లు రద్దు వల్ల లాభాలు ఏమేరకు ఉన్నాయో చెప్పలేం కానీ అన్ని రంగాలపైనా నోట్ల రద్దు ప్రభావం పడింది. వ్యాపారాలు తిరోగమనం పట్టాయి. రూపాయి మారకం విలువ తగ్గడం మరో వైపు డాలర్ విలువ పడిపోవడంతో ఆ ప్రభావం మరింతగా కనిపించింది. ఇప్పటికీ కొన్ని రంగాలు కోలుకోలేని పరిస్థితి ఏర్పడింది.

ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం

కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందాన పెద్ద నోట్లు రద్దుతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. సామాన్య మధ్య తరగతిలో కొనుగోలు శక్తి కనిష్ట స్థాయికి పడిపోయింది. సాధారణంగా ప్రతీ ఏటా నిత్యావసరాల కొనుగోలు 10 నుంచి 15 శాతం వృద్ధి చెందుతూ ఉంటుంది. రూపాయి మారకం విలువ పెరిగిన కొనుగోళ్ల లెక్కించి ఈ నిష్పత్తిని అంచనా వేస్తారు. విచిత్రం ఏమిటంటే ఇప్పుడు మార్కెట్‌లో 2016 నాటి పరిణామాలే కనిపిస్తు న్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని ప్రధాన పట్టణాలలో మూడింట ఒక్కింట షాపులు అద్దెలు కట్టలేక, వ్యాపారాలు లేక ఖాళీ చేసే పరిస్థితి ఏర్పడింది.

ఉమ్మడి జిల్లాలో తిరోగమనం

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అన్ని రంగాలపైనా ఆర్థిక తిరోగమనం కనిపిస్తుంది. పెద్ద నోట్లు రద్దు అనంతరం కరోనా ఆ తర్వాత ఐదేళ్ల దుష్టపాలన జిల్లాలో ఆర్థిక పరిస్థితిని కుంగదీశాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు అయినప్పటికీ జిల్లాలో ఆర్థిక రంగంలో చెప్పుకోదగ్గ మార్పులు కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లాలో సుమారు 40 లక్షలు మంది జనాబా ఉండగా 90 శాతం పేద సామాన్య, మధ్య తరగతి ప్రజలే ఉన్నారు. జిల్లాలో గత ఐదేళ్లలో ఆదాయం వనరులు తెచ్చిపెట్టే అన్ని వ్యాపారాలకు కష్టాలు తప్పలేదు. ఉమ్మడి జిల్లాకు ఆదాయం తెచ్చిపెట్టే ఆక్వాకు చేయూతనివ్వకపోవడంతో మొత్తంగా ఆర్థిక లావాదేవీలు క్షీణస్థితికి చేరాయి. భవన నిర్మాణ రంగానికి సంబంధించి సుమారు 50 అనుబంధ వ్యాపారాలు కుంటుపడ్డాయి.

రెండవ రోజు కొనసాగిన ఐటీ సోదాలు

అందుబాటులో లేని వ్యాపారవేత్త



ఆర్‌ఆర్‌పేటలో సేఫ్ మ్యాక్ సొసైటీ

ఏలూరు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వ్యాపారవేత్త నూకల రామకృష్ణ ఇంటిపైన, ఆయనకు సంబంధించిన ఆస్తులపై రెండవ రోజు కూడా సెంట్రల్ ఇన్‌కమ్‌టాక్స్ అధికారులు సోదాలు కొనసాగించారు. తమిళనాడుకు చెందిన సెంట్రల్ ఇన్‌కమ్‌టాక్స్ అధికారులు సీఐఎస్‌ఎఫ్ జవాన్లతో ఏలూరు నగరానికి వచ్చి పత్తేబాదలో ఉన్న ఉండవల్లి అపార్టుమెంటులోని వ్యాపారవేత్త నూకల రామకృష్ణ ఇంట్లో సోదాలు చేపట్టారు. ఆయనకు సంబంధించి ఏలూరు ఆర్ఆర్ పేటలో ఉన్న సేఫ్‌మ్యాక్ సొసైటీ లిమిటెడ్ బ్యాంకులో కూడా సోదాలను గురువారం నిర్వహించారు. ఐదు కార్లలో వచ్చిన అధికారులు తమ వాహనాలపై స్టిక్కర్లు అంటించుకుని వచ్చి సోదాలు నిర్వహిస్తున్నారు. ఏలూరు తూర్పు వీధిలో ఉన్న ఆయన పాత ఇంట్లో కూడా తనిఖీలు చేస్తున్నారు. ఈ సోదాలు శుక్రవారం కూడా కొనసాగిస్తారని తెలుస్తోంది. ఈ తనిఖీల నేపథ్య ంలో రామకృష్ణ అధికారులకు అందుబాటులో లేకుండా వేరే ప్రాంతంలో ఉన్నారు. ఆయన కార్యాలయంలో పనిచేసే అకౌంటెంట్లు, గుమస్తాలు కూడా ఫోన్ స్విచ్ఆఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్ళినట్లు తెలుస్తోంది.

గుడ్డుకు మంచిరోజులు

» రెండు రోజులుగా పెరిగిన ధర » ఊపిరి పీల్చుకుంటున్న పౌల్ట్రీ రైతులు



తణుకు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెరిగిన గుడ్డు ధరలతో పౌల్ట్రీ పరిశ్రమకు పెద్ద ఉపశమనం కలిగింది. ప్రస్తుతం గుడ్డు ధర 5 రూపాయలు నుంచి 5.50 పైసలు పెరిగింది. గత రెండు రోజులుగా ఈ ధర ఉంది. రానున్న జనవరి వరకు ఇదే ధరలు కొనసాగితే కొంత మేరకు రుణాలు తీర్చుకోవచ్చని పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు. రెండు రోజుల క్రితం వరకు గుడ్డు ధర రూ. 5 ఉండేది. రిటైల్ మార్కెట్లో ఏడు రూపాయలకు విక్రయిస్తున్నారు. వేసవికాలంలో అనేక రకాలుగా ఇబ్బందులు పడిన రైతులకు ప్రస్తుతం చలికాలం కావడంతో వినియోగం పెరిగింది. వేసవిలో కోళ్ళు నీరు తాగడం వల్ల గుడ్ల ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం చలివల్ల మేత కూడా తినడం వల్ల గుడ్డుల ఉత్పత్తి కూడా పెరిగింది. దానికి తోడు ఈశాన్య రాష్ట్రాలకు ఎగుమతులు అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో కోటి 70 లక్షల కోళ్ళు సామర్థ్యం ఉన్నప్పటికి ఆయా రైతులు వద్ద కోటి 40 లక్షల కోళ్ళు మాత్రమే ఉన్నాయి. వాటి నుంచి ప్రతి రోజు కోటీ 10 లక్షల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. స్థానికంగా సగం వరకు గుడ్లు వినియోగిస్తారు. మిగిలిన సగం ఈశాన్య రాష్ట్రాలైన పశ్చిమ బెంగాల్, బిహార్, అసోం రాష్ట్రాలకు రోజు 30 లారీలు వెళుతుంటాయి. ధరలు పెరుగుదలతో రైతులు కొద్దిగా కోలుకునే పరిస్థితి కనిపిస్తున్నది.

ఈ ధర నిలకడగా ఉండాలి



పెరిగిన గుడ్డు ధరలు నిలకడగా ఉండాలి. ప్రస్తుతం రైతులకు ఉపశమనంగానే ఉంది. ఇప్పటి వరకు అనేక ఎత్తుపల్లాలు రైతులు ఎదుర్కొన్నారు. నష్టాలు భరించలేక చాలా మంది ఇతర రంగాల వైపు మళ్లుతున్నారు. ఇలాంటి ధరలు వల్ల పరిశ్రమకు మంచిరోజులు వచ్చినట్లు భావించాలి.

- మల్లిన శ్రీనివాసరావు, నెక్ గోదావరి జోనల్ చైర్మన్

రోడ్డా.. చెరువా..

» వర్షాలకు ధ్వంసమైన గ్రామీణ రహదారులు


చెరువును తలపిస్తున్న గుర్వాయిపాలెం - పెదలంక రహదారి

కలిదిండి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో పలు రహదారులు దెబ్బతినడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుర్వాయిపాలెం నుంచి పెదలంక వరకు 10 కిలోమీటర్ల మేర పెద్ద పెద్ద గోతులు పడడంతో వర్షపు నీరు గోతుల్లో నిల్వ ఉండి చెరువులను తలపిస్తున్నాయి. ఈ రహదారిపై ఆర్టీసీ బస్సుల రాకపోకలు నడపడానికి అధికారులు అభ్యంతరం తెలుపుతున్నారు. యడవల్లి- మట్ట గుంట ప్రధాన రహదారిపై పెద్ద గోతులు పడడంతో వాహనాలు గోతుల్లో దిగబడుతున్నాయి. గంటల తరబడి వాహనాల రాపోకలకు అంతరాయం కలుగుతోంది. వాహనదారులు ఈ మార్గాల్లో ప్రయాణం చేయాలంటేనే హడలిపోతున్నారు. వర్షానికి గోతుల్లో నీరు ఉండటంతో అవి ఎంత లోతు ఉన్నాయో అంచనా వేయలేక ద్విచక్ర వాహనదారులు గోతుల్లో పడి క్షతగాత్రులవుతున్నారు. కాళ్లపాలెం - తాడినాడ ప్రధాన రహదారి గోతులమయంగా మారింది. చినతాడినాడ వయా పోతుమర్రు, కలిదిండి రహదారి గోతులు పడి కంకర పైకి లేచిపోవడంతో వర్షానికి బురదకయ్యగా మారింది. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రహదా రుల మరమ్మతులు పట్టించుకోకపోవడం వల్లే రహదారులు గుంతలు పడి అధ్వానంగా మారాయని కొద్దిపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స.హ చట్టం సామాన్యుని చేతిలో బ్రహ్మాస్త్రం


మండవల్లి సదస్సులో మాట్లాడుతున్న వేణుమాధవ్

ముదినేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం ముదినేపల్లిలో సమాచార హక్కు చట్టం-2005పై మండల స్థాయి అవగాహన సదస్సు జరిగింది. ఏవో బి.వేణుమాధవ్ మాట్లాడుతూ ఈ చట్టం పౌరులకు ఆయుధం లాంటిదన్నారు. ఏ సమాచారం అవసరమైనా ఒక కాగితంపై వివరాలు రాసి కోర్టు ఫీజు స్టాంపు అతికించి దరఖాస్తు చేయాలని తెలిపారు. గ్రామాల వ్యవసాయ సహాయకులు, రైతులు, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

● మునునూరు : సమాచార హక్కు చట్టంతో సమ సమాజస్థాపన, రాజ్యాంగ విలువలు సాధించవచ్చని ఏవో ఎస్.మధుమోహన్, నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్ (బాబి) అన్నారు. ముసునూరు వ్యవసాయ కార్యాలయం వద్ద సమాచార హక్కు చట్టం-2005పై ప్రజలకు అవగహన సదస్సు నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ఈ చట్టం సామాన్యుని చేతిలో బ్రహ్మాసమన్నారు. మహిళా పోలీస్ సంధ్యారాణి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, హెచ్‌వో జ్యోతి ప్రియాంక, వార్డు సభ్యులు నల్లిబోయిన రాంబాబు, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

● మండవల్లి : సమాచార హక్కు చట్టం-2005 ద్వారా ప్రజలు అడిగే సమాచారాన్ని ఎరువులు పురుగు మందుల డీలర్ల అందించాలని ఏవో జరీనా తెలిపారు. మండవల్లి వ్యవసాయ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. అప్పిలేట్ అధికారిగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి, ఏడీఏ, ఏవో ఫోన్ నెంబర్లు రైతు సేవాకేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. ఎరువులు పురుగు మందుల దుకాణాదారులు పాల్గొన్నారు.

● నూజివీడు : సహకార చట్టం 2005 పై అవగాహన కార్యక్రమం నూజివీడు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో నిర్వహించారు. ఏవో ఎ.చాముండేశ్వరి చట్టం ఉపయోగాలను రైతులకు వివరించారు. గ్రామ స్థాయి నుంచి పార్లమెంట్ వరకు తమకు కావాల్సిన సమాచారాన్ని ఈ చట్టం ద్వారా పొందటానికి రాజ్యాంగం హక్కు కల్పించిందన్నారు.

డిసెంబరు 4న ప్రజా హక్కుల ర్యాలీ

చాట్రాయి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విజయవాడలో డిసెంబరు 4న జరిగే ప్రజా హక్కుల ర్యాలీ విజయవంతం చెయ్యాలని కోరుతూ మండలంలోని చీపురుగూడెం శివారు మర్రిబంధంలో గురువారం సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ ఆధ్వర్యంలో ఎర్ర జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజా హక్కుల ర్యాలీ జరుగుతుందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను చంద్రబాబు సర్కార్ అమలు చెయ్యకపోతే ప్రజల నిరసన ఎదుర్కొవల్సి వస్తుందని హెచ్చరించారు. నాయకులు డి.పుల్లారావు, గోవిందు, తిరుపతరావు, రాజేంద్రప్రసాద్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూరగాయల రైతులకు రాయితీలు

చాట్రాయి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కూరగాయలు పండించే రైతులకు ఉద్యానశాఖ రాయితీలు అందిస్తున్నదని సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌వో హేమ గురువారం తెలిపారు. చాట్రాయి మండలంలో 50 ఎకరాల్లో రైతులు కూరగాయలు సాగు చేస్తున్నారని, సిమెంట్ పోల్స్ వేసి తీగజాతి కూరగాయలు సాగు చేస్తే ఎకరానికి రూ.లక్ష, హైబ్రీడ్ కూరగాయల విత్తన ఉత్పత్తి, మల్చింగ్ వేసుకున్న రైతులకు ఎకరానికి రూ.8 వేలు, ప్లాస్టిక్ మల్చింగ్ వేసుకున్న రైతులకు ఎకరానికి రూ.6,400 రాయితీ ఇస్తున్నామన్నారు.

ధాన్యం కొనుగోలు చెయ్యాలి

చాట్రాయి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈ క్రాప్ నమోదు లేకపోయినా ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చెయ్యాలని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. మండలంలోని చిన్నంపేటలో గురువారం రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో కొంత మంది రైతులకు ఈక్రాప్ చెయ్యకపోవటం వలన ధాన్యం ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోతున్నారని వాపోయారు. ఈఏడాది గ్రామంలో కౌలు రైతులు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ రెవెన్యూ శాఖ గుర్తింపు కార్డులు జారీ చెయ్యకపోవటం విడ్డూరమని, వెంటనే గుర్తింపు కార్డులు జారీ చెయ్యాలని కోరారు. ఉన్నతాధికారులు స్పందించి క్షేత్ర పరిశీలన చెయించి రైతులకు సాగుపత్రాలు జారీ చేసి ధాన్యం కొనుగోలు చెయ్యాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా నాయకుడు ఎస్‌నరసింహా, మండల నాయకులు కె.ఆనందం, ఈవీ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యం

ముసునూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉందని సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీ సత్యనారాయణ, టీడీపీ గ్రామ అధ్యక్షులు బర్మా శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మానురాజు సురేష్ అన్నారు. అక్కిరెడ్డిగూడెంలో గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

టైర్ పంక్చరై ఆటో బోల్తా
ఆరుగురికి గాయాలు


చికిత్స పొందుతున్న మహిళ

నూజివీడు, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): నూజివీడు మండలం సిద్ధార్థన గర్ వద్ద వ్యవసాయ కూలీలతో వెళుతున్న ఆటో టైర్ పంక్చరై బోల్తాపడి ఘటనలో ఆరుగురు మహిళలకు గాయాలయ్యాయి. నూజివీడు మండలం అన్నవరం నుంచి రెడ్డిగూడెం మండలం నాగులూరుకి వ్యవసాయ పనుల కోసం తొమ్మిది మంది మహిళ లు ఆటోలో బయల్దేరారు. ఈ ఆటో సిద్ధార్థనగర్ గ్రామ సమీపంలో టైర్ పంక్చరై తిరగబడింది. ఈ ఘనటలో నాగమల్లేశ్వరి, రమణమ్మ, రజినీ, రాజ్యలక్ష్మి, శ్రీదేవి, వెంకటరత్నం గాయాలపాలయ్యారు. వీరిని వెంటనే నూజివీడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో నాగమల్లీశ్వరి, వెంకట రత్నమ్మను మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మంత్రి కొలుసు పార్థసారథి నూజివీడు, విజయవాడ ఆస్పత్రి వైద్య అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధితు లకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు.

ఆస్పత్రుల్లో మహిళా సిబ్బంది రక్షణకు చర్యలు


సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

నూజివీడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల్లోని మహిళా ఉద్యోగుపై లైంగిక వేధింపులకు జరగకుండా వారి రక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా పోలీస్ ఏఆర్ డీఎస్పీ త్రిజీ శ్రీహరి స్పష్టం చేశారు. ఆస్పత్రుల్లో మహిళా వైద్యులు, ఆరోగ్య సంరక్షణ సహాయకులు, కార్మిక రక్షణ పరిశీలనకై నియమిం చిన కమిటీ సభ్యులు గురువారం నూజివీడు గిఫర్డ్ మెమోరియల్ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆస్పత్రిలోని సీసీ కెమెరాల పర్యవేక్షణ కేంద్రం, మహిళా వైద్యులు, సిబ్బంది, విశ్రాంతి ప్రదేశాల వద్ద రక్షణ చర్యలను ఆయన పరిశీలించారు. డీఎస్పీ శ్రీహరి మాట్లాడుతూ కోల్‌కత్తాలోని ఒక ఆస్పత్రిలో ఇటీవల జరిగిన దుర్ఘటన దృష్ట్యా ఆస్పత్రులలో పని చేసే మహిళా సిబ్బంది భద్రతకు ప్రభుత్వం జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిటీ జిల్లాల్లోని 100 పడకల పైబడిన ఆస్పత్రులను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తుందన్నారు. ఆస్పత్రులలో కెమెరాలు తప్పనిసరిగా ఉంచాలన్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో వచ్చేవారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఆకతాయిలు మద్యం సేవించి అల్లరి చేసే మూకలను ఆస్పత్రిలోకి అనుమతించకుండా భద్రత సిబ్బంది గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. గిఫర్డ్ ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ పి.శ్యామ్‌మోజేష్, అడ్మినిస్ట్రేటర్ పి.ప్రసంగి, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ దీప్తి, కమిటీ సభ్యులు చప్పిటి దుర్గాప్రసాద్, డాక్టర్ పద్మజారాణి, డాక్టర్ వి.శారద, డాక్టర్ షేక్ షఫీజ్, జిల్లా ఫైర్ ఆఫీసర్ రాధాకృష్ణ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలితో క్యాన్సర్ నివారణ


చనుబండలో కేన్సర్‌పై అవగాహనా ర్యాలీ

చాట్రాయి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన జీవనశైలి, పౌష్టికాహారం, మానసిక ప్రశాంతత ద్వారా క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చని డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆర్.లక్ష్మీనారాయణ అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహనా దినం సందర్భంగా గురువారం వైద్యశాఖ ఆధ్వర్యంలో చాట్రాయి, చనుబండలలో ర్యాలీలు నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ ఎక్కువ కావటం ఆందోళన కలిగిస్తుదదని, బలహీనమైన రోగ నిరోధక శక్తి, లైంగిక వ్యాధులు, ఏళ్ళ తరబడి గర్భ నిరోధక మాత్రలు వాడటం, జీవిత భాగస్వామితో కాకుండా అపరిచితులతో లైంగిక సంబంధాలు వంటి కారణాలతో గర్భాశయ క్యాన్సర్‌కు గరవుతున్నారని అన్నారు. ఈ నెల 14 నుంచి ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు బృందంగా ఇంటింటి కీ వెళ్ళి స్క్రీనింగ్ సర్వే జరిపి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి క్యాన్సర్ పరీక్షలు చేస్తారని ఆయన తెలిపారు. వైద్యాధికారులు విజయలక్ష్మి, దుర్గాప్రసాద్, శ్రీనివాసరెడ్డి, సీహెచ్‌వో రమణ, ఇన్‌చార్జి హెచ్‌ఎం అమరయ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● ముదినేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని గురువారం ముదినేపల్లి మండలంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిర్వహించారు. ముదినేపల్లి, దేవపూడి, గురజ పీహెచ్‌సీల పరిధిలో వైద్యాధికారులు డాక్టర్ శాంతి శ్రీ, శ్వేత తరిణి, డాక్టర్ వినయ్, మధు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది క్యాన్సర్ అవగాహన ర్యాలీలు నిర్వహించారు. క్యాన్సర్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దేవపూడిలో పాఠశాలల విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది రహీం, వరలక్ష్మి ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రానికి 108 వాహనాల తరలింపు



కైకలూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎక్కడ ప్రమాదాలు జరిగినా క్షణాల్లో అక్కడికి చేరుకొని బాధితులను సమీప ఆస్పత్రికి తరలించే 108 వాహనాలను చడిచప్పుడు లేకుండా జిల్లా కేంద్రానికి తరలించేశారు. దీంతో మిగిలిన వాహనాలపై భారంపడి బాధితులకు వైద్యం అందించడంలోనూ ఆలస్యమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కైకలూరు నియోజకవర్గంలో మరో సమస్య తలెత్తింది. నియోజకవర్గంలో నాలుగు మండలాలకు గతంలో నాలుగు 108 వాహనాలు ఉండేవి. సుమారు ఏడాదిన్నర క్రితం మండవల్లి వాహనాన్ని, ఐదు నెలల క్రితం కలిదిండి వాహనాన్ని ఏలూరు జిల్లా కేంద్రానికి తీసుకువెళ్లిపోయారు. దీంతో ఆ మండలాల్లో 108 వాహనాలు లేకపోవడంతో ఏవైనా ప్రమాదాలు సంభవించినా, అత్యవసర సేవలు కావాల్సివచ్చినా కైకలూరు, ముదినేపల్లిలోని వాహనాలపై ఆధారపడాల్సి వస్తుంది. దీంతో దూర ప్రాంతాల నుంచి వాహనాలు రావల్సి ఉండడంతో ఆలస్యమవుతుంది. క్షతగాత్రులకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నెలల తరబడి ఇక్కడి వాహనాలు వేరొక చోటకి తరలించి జిల్లా స్థాయి అధికారులు పట్టించుకోకపోవడంపై ఆయా మండలాల్లోని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు ఆయా మండలాల్లో 108 వాహనాలు పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

సోషల్ మీడియాతో జరభద్రం

కైకలూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియా ద్వారా పరిచమయ్యే వ్యక్తులతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కైకలూరు టౌన్, రూరల్ ఎస్సైలు డి.వెంకటేకుమార్, ఆర్.శ్రీను, వి.రాంబాబు అన్నారు. దొడ్డిపట్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో చట్టాలపై గురువారం విద్యార్థులకు వగాహన సదస్సు నిర్వహించారు. సెల్‌ఫోన్ల వ్యామోహంలో అనేకమంది ఆడపిల్లలు ఇబ్బందులు కొనితెచ్చుకుంటున్నారన్నారు. హెచ్ఎం కె.విష్ణుమూర్తి పాల్గొన్నారు.

వంగవీటి రంగాకు ఘన నివాళి



మండవల్లి నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధులకు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగాకు మండవల్లి ప్రజానీకం గురువారం ఘనంగా నివాళులర్పించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండ వల్లి పెద్ద సెంటర్‌లో తొలగించిన వంగవీటి మోహన రంగా విగ్రహం పునఃప్రతిష్ఠ చేపట్టారు. మండవల్లి పరిసర ప్రాంతాలకు చెందిన 33 మంది స్వా తంత్ర్య పోరాటంలో ప్రాణాలు కోల్పోగా, 1972 ఆగస్టు 15న ఆనాటి నాయకులు మండవల్లి సెంట రులో సమరయోధుల స్థూపం నిర్మించారు. అదే ప్రదేశంలో పక్కన రాధా,రంగా మిత్రమండలి జెం డా దిమ్మెను ఏర్పాటు చేశారు. మండల కూటమి నాయకులు గుడివాడ చిట్టిబాబు, మండల ఎంపీపీ పెద్దిరెడ్డి రాము, చిరంజీవి యువత ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు, జనసేన నాయకుడు వర్రే హనుమాన్, సామాజికవేత్త ప్రొఫెసర్ డాక్టర్ సుధాబత్తుల విజయ్‌కుమార్, నియోజకవర్గ జనసేన నాయకుడు కోట విప్లవ వరప్రసాద్, మాజీ సొసైటీ అధ్యక్షుడు గుడివాడ బాబీ, గుడివాడ మురళీ, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానం దారి ధ్వంసం



కలిదిండి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పేట కలిదిండిలో శ్మశానానికి వెళ్లే దారిని ఓ వ్యక్తి ఆక్రమించుకుని జేసీబీతో గురువారం ధ్వంసం చేశాడు. దీంతో గ్రామస్థులు రెవెన్యూ, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయగా, జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. శ్మశానం దారి ఓ వ్యక్తి ఆక్రమించుకుని దహన సంస్కారాలకు వెళ్లకుండా ఇబ్బందులు పెడుతున్నాడని పలుమార్లు రెవెన్యూ, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లగా, సమస్య పరిష్క రించాలని అధికారులను ఆదేశించినప్పటికీ పట్టిం చుకోలేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇందువల్లే శ్మశాను దారిని జేసీబీతో ధ్వంసం చేసి తన స్థలంలో కలుపుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సర్వే చేసి శ్మశాన దారికి ఆటంకాలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా కొండలరావు



కలిదిండి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కలిదిండి ఇన్‌చార్జి ఎంపీడీవోగా కొండలరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈవోఆపీర్డీగా పని చేస్తున్న ఆయనను ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించారు. ఇంతకు ముందు ఇక్కడ పని చేసిన ఎంపీడీవో దినతేజ్ తాడేపల్లి కమిషనర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

వలసపల్లి బ్రిడ్జి వద్ద ఇసుక అక్రమ రవాణా


బ్రిడ్జి పిల్లర్ల వద్ద తవ్విన ఇసుక

ముసునూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వలసపల్లి తమ్మిలేరుపై ఉన్న బ్రిడ్జి వద్ద అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోంది. బ్రిడ్జి పిల్లర్స్ పౌండేషన్ వద్ద ఉన్న ఇసుకను ఎడ్లబళ్ళు ట్రాక్టర్లతో తరలించుకు పోతుండగా గురువారం స్థానికులు అడ్డుకున్నారు. ఈ తవ్వకాల వల్ల బ్రిడ్జి పిల్లర్స్ పౌండేషన్ సైతం బయట పడిందని, భవిష్యత్‌లో బ్రిడ్జికి ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అక్రమ ఇసుక తవ్వాకాలను అడ్డుకోవాలని కోరుతున్నారు.

మందకొడిగా టీడీపీ సభ్యత్వ నమోదు

నూజివీడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు మందకొడిగా సాగుతోంది. మంత్రి కొలుసు పార్థసారథి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఉన్నా సభ్యత్వం చేర్పింపులు కార్యక్రమం మందగమనంతో సాగుతోంది. నూజివీడు రూరల్ మండలంలో సభ్యత్వ రిజిస్ట్రేషన్‌కు 4,476 ఉండగా, వీటిలో 1507మంది మాత్రమే కొత్తగా సభ్యులు చేరారు. ముసునూరు మండలంలో 2,859 మందిలో 1183, చాట్రాయి మండలంలో 2521లో 977, నూజివీడు పట్టణంలో 1076లో 616, ఆగిరిపల్లి మండలంలో 1697లో 610 మంది మాత్రమే కొత్త సభ్యులు సభ్యత్వం తీసుకున్నారు. నూజివీడు పట్టణంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం వెనుకబడింది. నూజివీడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి 12 వేలు పైచిలుకు ఓట్లు ఆధిక్యత రాగా, దీనిలో 6,500 వరకు నూజివీడు పట్టణంలోనే ఆధిక్యత ఉంది. అయితే సభ్యత్వ చేర్పింపుల్లో వెనుకబడింది.

భూమి రాయించుకున్న వ్యక్తిపై కేసు

ముదినేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దువాక గ్రామానికి చెందిన పెద్దింటి రామతులసీ అనే మహిళను నమ్మించి ఆమె భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న కలిదిండి మండలం పోతుమర్రుకు చెందిన పుట్టి రాంబాబుపై గురువారం కేసు నమోదైంది. పోలీసు కథనం ప్రకారం రామతులసీ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ వృద్ధాప్యంలో ఉన్న తన తల్లిని కూడా పోషిస్తున్నది. ఆ సమయంలో మాయమాటలు చెప్పి, నీవు క్యాన్సర్‌తో చనిపోతే నీ తల్లిని నేను పోషిస్తా, నీకు వ్యాధి తగ్గితే తిరిగి నీ పొలం రిజిస్ట్రేషన్ చేసేస్తా అంటూ రామతులసీని నమ్మించి 76 సెంట్ల భూమిని 2023లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం మెరుగుపడటంతో రాంబాబు తిరిగి పొలం రిజిస్ట్రేషన్ చేసేందుకు నిరాకరిస్తుండటంతో తనకు జరిగిన మోసంపై ఆమె ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై గురువారం ఆమెకు మద్దతుగా పలువురు పాస్టర్లు పోలీస్ స్టేషన్‌కు వచ్చి రామతులసీకి న్యాయం చేయాలని డిమాండ్ చేసి సీఐ రవికుమార్‌తో చర్చించారు. దీనిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.